

# శ్రీ నల్లపోచమ్మ ప్రతిష్టకు 15000 అందజేసిన నవీన్ గుప్తా

**నవీన్ గుప్త కు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు.....**

**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 3....**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామంలో నల్లపోచమ్మ ప్రతిష్టకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా తన కష్టార్జితంలో కొంత వెచ్చించి చిన్నగొట్టిముక్ల కొత్త కాలనీ నల్ల పోచమ్మ గుడి కమిటీ సభ్యుల కోరిక మేరకు తన వంతు సహాయంగా 15000 రూపాయలు విరాళంగా అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలందరూ సుభిక్షంగా సుఖ సంతోషాలతో పాడిపంటలతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కమిటీ సభ్యులు. కుమ్మరి వీరస్వామి. రాములు. తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి చైర్మన్ చొరవ



**నాగర్ కర్నూల్ రూరల్, సెప్టెంబర్ 03, (వుదయం ప్రతినిధి):**

పట్టణంలో విద్యుత్ సరఫరా, లోవోల్టేజ్ సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ ఛైర్మన్ తీగల సురేంద్ర కుమార్ చొరవ తీసుకున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఎస్ఈ కె.వి. నరసింహారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి కొత్త విద్యుత్ స్తంభాలు, అవసరమైన చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా లోవోల్టేజ్ కారణంగా ప్రజలు, వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. స్పందించిన ఎస్ఈ సమస్యలను పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బాదం రమేష్, కౌన్సిలర్లు శ్రీనివాసులు, పద్మ, అలివేల, శంకర్, ఆవంచ రాజు, హరీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను కలిసిన టీయూడబ్ల్యూజే–ఐజేయూ నూతన కార్యవర్గం

**జర్నలిస్టులకు అండగా ఉంటా.. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హామీ**

**పటాన్‌చెరు (వుదయం):**

పటాన్‌చెరు నియోజకవర్గ టీయూడబ్ల్యూజే-ఐజేయూ నూతన కార్యవర్గం గురువారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసింది. పటాన్‌చెరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు పత్తి నర్సింహా ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం తమ సమస్యలతో కూడిన మెమోరాండాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పత్తి నర్సింహా మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమంతో పాటు సంఘం కార్యక్రమాలకు ఎమ్మెల్యే సహకారం ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి స్పందిస్తూ జర్నలిస్టులకు, టీయూడబ్ల్యూజే-ఐజేయూకు తనవంతు సహకారం తప్పకుండా అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పర్చ శ్రీనాథ్, పటాన్చెరు నియోజకవర్గ సలహాదారులు కాశిపతి, సులేమాన్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కమిటీ భాద్యులు శ్రీనివాస్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మాజిద్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు విట్టల్, రఘురాంరెడ్డి, రాజు, నాగేష్, జీవరత్నం, సంయుక్త కార్యదర్శులు శ్రీనివాస్, ప్రభాకర్, కోటెశ్, ఆర్గనిసింగ్ సెక్రటరీలు రాజు, వివేక్, శ్రీనివాస్, శంకర్, శేఖర్, మహేందర్ గౌడ్, సిద్ధు, శ్రీనివాస్, నాయుడు, పురుషోత్తం, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్షర ఉన్నత పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారుల సందడి**

**అయిజ, సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ పరిధిలోని అక్షర ఉన్నత పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ యు. మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. సంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు పాఠశాల ఆవరణలో సందడి చేయడంతో పాఠశాల మొత్తం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కార్యక్రమంలో భాగంగా శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతను, శ్రీకృష్ణుడి జీవితం, ఆయన బోధించిన ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ, మంచితనం వంటి విలువలను ప్రిన్సిపాల్ యు. మహేందర్ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. శ్రీకృష్ణుడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు క్రమశిక్షణ, నిజాయితీ, స్నేహభావం, పరస్పర గౌరవం వంటి మంచి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ యు. మహేందర్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమికి ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉందని తెలిపారు. పండుగల వెనుక ఉన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల వారిలో అవగాహన పెంపొందించవచ్చన్నారు. అందులో భాగంగానే ప్రతి సంవత్సరం పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.చిన్నారులు ఉత్సాహంగా వేషధారణలో పాల్గొనడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పండుగ ప్రాధాన్యతను ఆనందంగా తెలుసుకున్నారని ఆయన తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, ఐక్యతా భావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు, విద్యార్థినులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.




# భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మ దిన వేడుకలు

**వేద పండితులు గురువులు శాస్తుల వామన శర్మ....**

**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 3....**

మండల వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మ దిన వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం. వేద పండితులు గురువులు శాస్తుల వామన శర్మ శ్రీకృష్ణ జన్మాష్టమి గురించి ఇలా వివరించారు.చేతవెన్న ముద్ద చెంగల్వ పూదండ బంగారు మొలతాడు పట్టుదట్టి సందె తావీదులు సరిమువ్వ గజ్జెలు చిన్ని కృష్ణ నిన్ను చేరికొలుతు. కృష్ణాష్టమి నాడు భక్తులు పగలంతా ఉపవాసం ఉండి, సాయంత్రం శ్రీకృష్ణుని పూజిస్తారు. శ్రావణ మాసంలో



లభించే పళ్ళు, అటుకులు, బెల్లం కలిపిన వెన్న, పెరుగు, మీగడ స్వామికి నైవేద్యంగా పెడతారు. ఊయల కట్టి అందులో శ్రీకృష్ణ విగ్రహమును పడుకోబెట్టి ఊపుతూ రకరకాల పాటలు, కీర్తనలు పాడతారు.

**పుర వీధుల్లో ఎత్తుగా ఉట్లు కట్టి పోటీపడి వాటిని కొడతారు. అందుకే ఈ పండుగని 'ఉట్ల పండుగ' లేదా 'ఉట్ల తిరునాళ్ళు' అని పిలుస్తారు.**

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జయంతి వ్రతంగా ఆచరిస్తే గోదానం చేసిన ఫలితం, కురుక్షేత్రంలో సువర్ణదానం చేసిన ఫలం దక్కుతుందని బ్రహ్మాండ పురాణం చెప్పింది. కలియుగంలో కల్మషాల్ని హరించి, పుణ్యాల్ని ప్రసాదించే పర్వదినం ఇదని కూడా వివరించింది.. దుష్టశిక్షణ.. శిష్ట రక్షణ... అన్న గీతోపదేశంతో మానవాళికి దిశనిర్దేశం చేశారు కృష్ణభగవానుడు. మహాభారత యుద్ధాన్ని ముందుండి నడిపించిన మార్గదర్శి ఆయన. మహాభాగవతం కథలను విన్నా... దృశ్యాలను తిలకించినా జీవితానికి సరిపడా విలువలెన్నో బోధపడతాయి. ఆ కావ్యం ఇప్పటి పరిస్థితులకు ఒక మార్గదర్శకంగా ఉండటం కృష్ణుడి మహోన్నత వ్యక్తిత్వానికి, ఆయన లీలలకు అద్దం పడుతోంది. ద్వాపరయుగంలో జన్మించిన కృష్ణుడు నేటి కలియుగానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అందుకే ఆయన్ను అందరూ తమ ఇష్టదైవంగా కొలుస్తున్నారు. వివిధ రూపాల్లో, సంప్రదాయాలతో భక్తిప్రపత్తులతో కృష్ణుడిని కొలుస్తున్న ఆయా రాష్ట్రాల వారి సంప్రదాయాలు మన భారతీయ సంస్కృతికి విలక్షణమైన అందాన్ని తెస్తాయి అని వివరించారు.

# గ్రామానికి చేరిన ప్రత్యేక వైద్యం.. 259 మందికి వైద్య సేవలు

**రైతులు, పేదలకు వైద్యం అందించడం అభినందనీయం**

**గట్టు, సెప్టెంబర్ 03 (వుదయం కరస్పాండెంట్)**

వైద్యం కోసం పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రత్యేక వైద్య సేవలు గ్రామస్థాయిలోనే అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని గ్రామ ప్రజలు పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులతో నిత్యం బిజీగా ఉండే రైతులు, ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలకు వైద్య సేవలు నేరుగా గ్రామానికి వచ్చి అందించడం గొప్ప విషయమని వారు హర్షం వ్యక్తం చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం అంతంపల్లి గ్రామంలో ఎస్‌బీఐ ఫౌండేషన్, భవిష్యభారత్ ఆధ్వర్యంలో ఎస్ బి ఐ సంజీవని గట్టు మొబైల్ మెడికల్ యూనిట్ ప్రాజెక్టు లో భాగంగా గురువారం స్పెషలైజ్డ్ హెల్త్




క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మొత్తం 259 మంది క్యాంప్‌కు హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. క్యాంప్‌లో జనరల్ మెడిసిన్, డర్మటాలజీ విభాగాలకు చెందిన వైద్యులు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, ఆర్థోపెడిక్ తదితర సాధారణ ఆరోగ్య సమస్యలను పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. చర్మ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి డర్మటాలజీ నిపుణులు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు చేశారు. అవసరమైన ల్యాబ్ పరీక్షలు నిర్వహించడంతో పాటు వైద్యుల సూచన మేరకు ఉచితంగా మందులు అందించారు.గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది రైతులు, కూలీలు, పేద కుటుంబాలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తుంటారని, వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లేందుకు సమయం, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయని గ్రామస్థులు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో వైద్య బృందమే గ్రామానికి వచ్చి పరీక్షలు నిర్వహించడం వల్ల సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రత్యేక వైద్యులు గ్రామానికి వచ్చి సేవలు అందించడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంతాల్లో తరచూ నిర్వహిస్తే పేదలు, రైతులు, వృద్ధులు, కూలీలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వారు కోరారు. ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ గ్రామస్థాయిలో వైద్య సేవలు అందిస్తున్న ఎస్‌బీఐ ఫౌండేషన్, భవిష్య భారత్ సేవలను గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పవన్ రెడ్డి, డాక్టర్ ఇందు మైత్రి, డర్మటాలజిస్ట్ డాక్టర్ రాకేష్ రెడ్డి, గ్రామ సర్పంచ్ శంకరమ్మ దానయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి మారెప్ప, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై క్యాంప్‌ను విజయవంతం చేసినందుకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# పంటల సమాధులపై.. కరెంట్ కుంభకోణం!

**నడిగడ్డపై నరకాసుర కోత.. అన్నదాతల నోట్లో మట్టి! 'ఉచితం' ఊచకోత.. మోటార్లు బుగ్గి, పైర్లు బొగ్గు! చావో రేవో తేల్చుకునేందుకు రోడ్డెక్కిన నడిగడ్డ రైతాంగం**

**గద్వాల, సెప్టెంబరు 03 (వుదయం బ్యూరో)**



పచ్చగా కనిపించాల్సిన పంట పొలాల్లో కరువు ఛాయలు అలుముకుంటున్నాయి. ఆకాశం వైపు ఆశగా చూసిన రైతుకు వరుణుడు నిరాశే మిగిల్చాడు. వర్షాలు ముఖం చాటేయడంతో ఇప్పటికే సాగు విస్తీర్ణం తగ్గిపోగా.. బావులు, బోర్లు, కాలువల కింద సాగులో ఉన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఈ సమయంలో విద్యుత్ సరఫరా కూడా సక్రమంగా లేకపోవడంతో వారి కష్టాలు రెట్టింపవుతున్నాయి. పంటకు నీరు పెట్టాలంటే కరెంటు తప్పనిసరి. కానీ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. లోవోల్టేజీ సమస్యతో మోటార్లు మొరాయిస్తుండగా.. సరిపడా విద్యుత్ అందక పంటలు ఎండిపోయే దుస్థితి నెలకొంది. దీంతో 'పంటను కాపాడండి.. కరెంటు ఇవ్వండి' అంటూ నడిగడ్డ రైతులు రోడ్డెక్కుతున్నారు.

3.28 లక్షల ఎకరాల్లో సాగు జిల్లాలో సెప్టెంబరు 2 నాటికి 3,28,505 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. ఇందులో అత్యధికంగా పత్తి 1,72,572 ఎకరాల్లో సాగవుతోంది. వరి 78,718, ఎర్రమిరప 30,347, కంది 27,114 ఎకరాల్లో సాగవుతున్నాయి. వీటితో పాటు వేరుశెనగ 4,551, మొక్కజొన్న 3,907, కూరగాయలు 3,003 ఎకరాల్లో సాగులో ఉన్నాయి.వర్షాలు అనుకున్న స్థాయిలో పడకపోవ డంతో ఈసారి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. సాగులో ఉన్న పంటలైనా చేతికందాలంటే ప్రస్తుతం సాగునీరు కీలకంగా మారింది. అందుకు ప్రధాన ఆధారం విద్యుత్‌నే. కరెంటు కోసం పడిగాపులు బావులు, బోర్ల కింద సాగు చేస్తున్న రైతులు విద్యుత్ కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని చెబుతున్నారు. ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితి మరికొన్ని రోజులు కొనసాగితే సాగులో ఉన్న పంటలు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.20,450 ట్రాన్స్‌ఫార్మర్లు.. 80-85 వేల మోటార్లు విద్యుత్ శాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 20,450 వ్యవసాయ ట్రాన్స్ ఫార్మర్లు ఉన్నాయి.సుమారు 80 వేల నుంచి 85 వేల వరకు వ్యవసాయ మోటార్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని అవసరాలకు కలిపి రోజుకు సుమారు 293.80 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. విద్యుత్ సరఫరా కోసం జిల్లాలో 67 సబ్‌స్టేషన్లు (33/11 కేవీ), 262 ఫీడర్లు పనిచేస్తున్నాయి. ఇంతటి విద్యుత్ మౌలిక వసతులు ఉన్నప్పటికీ పంటలకు అవసరమైన సమయంలో సరఫరా అందకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సబ్‌స్టేషన్ల ఎదుటే రైతుల నిరసనలు విద్యుత్ సమస్యపై రైతుల ఆగ్రహం క్రమంగా పెరుగుతోంది. కేటీదొడ్డి మండలంలో రైతులు రోడ్డుపైకి వచ్చి ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడి పరిస్థితిని సద్దుమణిగించారు. గట్టు మండలం కొత్తపల్లిలో అర్ధరాత్రి రైతులు సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. మండల కేంద్రంలోనూ టెంట్ వేసుకుని నిరసన చేపట్టారు. ధరూర్ మండలంలోనూ విద్యుత్ సరఫరా సక్రమంగా లేదంటూ రైతులు ఆందోళనకు దిగారు. పంటలకు నీరు అందక ఎండిపోతుంటే చూస్తూ ఊరుకోలేకే రోడ్డెక్కాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. పెట్టుబడి పోయే ప్రమాదం ఇప్పటికే వర్షాభావం, ఎల్నినో ప్రభావంతో సాగు విస్తీర్ణం తగ్గింది. సాగులో ఉన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోతే ఆ పెట్టుబడులన్నీ వృథా అయ్యే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడకపోయినా బోరు నీటితో పంటను కాపాడుకుందామంటే.. కరెంటు సహకరించకపోవడం రైతుకు మరో శాపంగా మారిందని అంటున్నారు. పంట చేతికొచ్చే వరకు కరెంటు ఇవ్వాలి ప్రస్తుతం రైతులకు కావాల్సింది హామీలు కాదని.. పంటను కాపాడుకునేంత విద్యుత్ సరఫరా అని వారు స్పష్టం చేస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అవసరమైన మేరకు నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరుతున్నారు. వోల్టేజీ సమస్యను పరిష్కరించి మోటార్లు కాలిపోకుండా చర్యలు తీసుకోవాలని.. సబ్‌స్టేషన్లలో సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. పంట చేతికొచ్చే వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. డిమాండ్‌కు తగ్గ సరఫరా చేయలేకపోతున్నాం'ఎస్ఈ అబ్దుల్ ఖరీం జోగులాంబ గద్వాల జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ అబ్దుల్ ఖరీం మాట్లాడుతూ.. జిల్లాలో డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ సరఫరా చేయలేకపోతున్నామని తెలిపారు. రైతులకు 12 గంటల విద్యుత్ అందిస్తున్నామని, ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేజ్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. రాత్రివేళల్లో సింగిల్‌ఫేజ్ విద్యుత్ అందిస్తు న్నట్లు వెల్లడించారు. కేటీదొడ్డి మండ లంలోని సబ్‌స్టేషన్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా సరఫరాలో ఇబ్బందులు తలెత్తాయని, సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లాలోని రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వర్షం కోసం ఆకాశం వైపు.. కరెంటు కోసం సబ్‌స్టేషన్ వైపు చూస్తున్న నడిగడ్డ రైతుకు ఇప్పుడు ప్రభుత్వం ఏ మేరకు అండగా నిలుస్తుందో వేచి చూడాలి.

# కరెంట్ కోతలతో రైతుల నడ్డి విరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**- 24 గంటల హామీ.. 13 గంటల సరఫరా**

**- 24 గంటల విద్యుత్ హామీ ఏమైంది? సీఎం సమాధానం చెప్పాలి**

**- సబ్‌స్టేషన్ల ముట్టడిలో బి ఆర్ ఎస్ నాయకుల**

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 03 (వుదయం బ్యూరో):**



వ్యవసాయానికి విద్యుత్ కోతలు విధిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ గురువారంబి ఆర్ ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగాయి. పార్టీ ఇచ్చిన పిలుపు, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు నాగర్ కర్నూల్ నియోజకవర్గంలోని తిమ్మాజిపేట, బిజినపల్లి, నాగర్ కర్నూల్, తాడూరు మండల కేంద్రాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్లను ముట్టడించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని, మరోవైపు పంటలకు అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బి ఆర్ ఎస్ నాయకులు ఆరోపించారు.

**సబ్‌స్టేషన్లలో లాగ్‌బుక్‌ల పరిశీలన**

నిరసనలో భాగంగా ఆయా సబ్‌స్టేషన్లలో విద్యుత్ సరఫరాకు సంబంధించిన లాగ్‌బుక్‌లను బి ఆర్ ఎస్ నాయకులు పరిశీలించారు. సంబంధిత ఏఈల సమక్షంలో వ్యవసాయానికి వాస్తవంగా ఎన్ని గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నారనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయానికి 13 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారని బి ఆర్ ఎస్ నాయకులు పేర్కొన్నారు.ప్రభుత్వం ఒకవైపు 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని చెబుతుండగా సబ్‌స్టేషన్ స్థాయిలో మాత్రం 13 గంటల సరఫరా జరుగుతోందని అధికారులు చెబుతున్నారని అన్నారు. ప్రభుత్వ ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరాకు మధ్య ఇంత వ్యత్యాసం ఎందుకు ఉందో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.సీఎం ప్రాంతానికి ఒక న్యాయం..

**మిగతా తెలంగాణకు మరో న్యాయమా?**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం, సొంత గ్రామంలో ఎక్కువ గంటలు విద్యుత్ సరఫరా చేస్తూ ఇతర ప్రాంతాల్లోని రైతులకు తక్కువ గంటలు విద్యుత్ అందించడం ఏమిటని బి ఆర్ ఎస్ నాయకులు ప్రశ్నించారు. సీఎం సొంత నియోజకవర్గంలో 18 గంటల వరకు విద్యుత్ ఉంటే మిగతా తెలంగాణ రైతులకు 8 నుంచి 13 గంటలతోనే సరిపెట్టాలా? అని నిలదీశారు.

ప్రభుత్వం వ్యవసాయానికి ఎన్ని గంటల విద్యుత్ సరఫరా చేస్తుందనే విషయాన్ని సబ్‌స్టేషన్ వారీగా బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. 24 గంటల ఉచిత విద్యుత్ హామీని నిలబెట్టుకోవాలని కోరారు.రైతుల సమస్యలపై బి ఆర్ ఎస్ రాజీపడే ప్రసక్తే లేదని, వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించే వరకు పోరాటం కొనసాగిస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమాల్లో ఆయా మండలాలకు చెందిన బి ఆర్ ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిష్ట కార్యక్రమంలో ఆవుల రాజిరెడ్డి



**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 3...**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామంలో నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోమారం గ్రామంలో అండర్ డ్రైనేజ్ పనులను ప్రారంభించారు. అనంతరం ఆవుల రాజి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది అని తెలిపారు. అదేవిధంగా మండలానికి చెందిన 12 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధులనుండి 385000ల విలువైన చెప్పులు రాజిరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం లబ్ధిదారులు ప్రభుత్వానికి ఆవుల రాజిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు . ఈ కార్యక్రమంలో పిఎసిహెచ్ చైర్మన్ వెంకటరామిరెడ్డి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా. మాధవ రెడ్డి. గోమారం సర్పంచ్ హైమావతి ఆంజనేయులు. సుధీర్ రెడ్డి. వీరస్వామి. ఆయా గ్రామాల ప్రజలు. తదితరులు పాల్గొన్నారు.

# లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు

**కల్వకుర్తి సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి)**

నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తపరీక్షలు నిర్వహిస్తున్నట్లు లైన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ క్యాంప్ కోఆర్డినేటర్ వి.సంపత్ కుమార్ తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 65 రకాల రక్త పరీక్షలకు సంబంధించిన 12 ప్రొఫైల్లకు 6000 రూపాయలు అవుతుందని కాగా లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద మధ్య తరగతి వారికి అందుబాటులో ఆరోగ్య సేవలు అందించేందుకు 500 రూపాయలకు మాత్రమే ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సంపత్ కుమార్ తెలిపారు. సెప్టెంబర్ 4 ,5 తేదీలలో ఈఅవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ పరీక్షలు ఉదయం ఏడు గంటల నుండి ప్రారంభమవుతాయని ఈ పరీక్షలు చేసుకునే పట్టణ ప్రజలు పరిగడుపున రావాలని తెలిపారు.అదేవిధంగా సెప్టెంబర్ 8వ



తేదీన లైన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో మెడి కవర్ హాస్పిటల్స్ హైదరాబాద్ వైద్య బృందంచే దామోదర్ రెడ్డి ప్రశాంత్ క్లినిక్ నందు ఉచితంగా గుండె పరీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈ గుండె పరీక్షలు ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 1:30 వరకు సంబంధిత టెస్టులు ఉచితంగా చేయబడతాయని ఆయన తెలిపారు. ఈ సదవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

# కృష్ణాష్టమి వేడుకలు చిన్నారుల గోపికా కృష్ణుల వేషధారణతో సందడి



**అచ్చంపేట,సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి)**

:శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని అచ్చంపేట పట్టణంలోని అంగన్వాడీ / ప్రభుత్వ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులకు గోపిక, శ్రీకృష్ణుని వేషధారణతో అలంకరించి ఉట్టి కొట్టించారు. చిన్న చిన్న కృష్ణులు, గోపికల వేషంలో ముస్తాబైన విద్యార్థులు అందరినీ ఆకట్టుకున్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కృష్ణాష్టమి విశిష్టతను పిల్లలకు వివరించారు.

# తుంగభద్రలో వరద బీభత్స ఒడ్డున మొసలి కలకలం!



**నాగలాదిన్నె వంతెన వద్ద హడలెత్తిన జనం.. చాకచక్యంగా బంధించిన గ్రామస్థులు**

**అలంపూర్ సెప్టెంబర్ 03 (వుదయం కరస్పాండెంట్)**

తుంగభద్ర నది ఉగ్రరూపం దాల్చిన వేళ.. ఓ మొసలి ఒడ్డుకు కొట్టుకొచ్చి జనాన్ని హడలెత్తించింది. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని నాగలాదిన్నె వంతెన సమీపంలో మొసలి ప్రత్యక్షం కావడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. నది నుంచి బయటకు వచ్చిన మొసలి బ్రిడ్జి పరిసరాల్లో సంచరిస్తుండటాన్ని గమనించిన రైతులు, గ్రామస్థులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. మొసలి కనిపించిందన్న సమాచారం క్షణాల్లో చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించింది. దీంతో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు అక్కడికి చేరుకున్నారు. మొసలి తప్పించుకునేందుకు ప్రయత్నించడంతో కొద్దిసేపు అక్కడ ఉత్కంఠ నెలకొంది. అయినప్పటికీ స్థానికులు ధైర్యంగా వ్యవహరించి సమన్వయంతో దాన్ని బంధించారు. దీంతో పెను ప్రమాదం తప్పడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. వరద ఉధృతికి కొట్టు కొచ్చిందా? తుంగభద్రలో భారీగా కొనసాగుతున్న వరద ప్రవాహంలో మొసలి కొట్టుకొచ్చి ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు. నీటి ప్రవాహం ఉధృతంగా ఉన్న సమయంలో నదిలోని వన్యప్రాణులు తమ ఆవాసాలను వీడి ఇతర ప్రాంతాలకు చేరుకునే అవకాశం ఉండటంతో పరివాహక ప్రాంతాల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవు తోంది. పట్టుబడిన మొసలిని అటవీశాఖ అధికారులకు అప్పగించేందుకు స్థానికులు చర్యలు చేపట్టినట్లు సమాచారం. అధికారులు మొసలిని పరిశీలించి సురక్షిత ప్రాంతానికి తరలించాల్సి ఉంది. నదీతీరంలో నిఘా పెంచాలి తుంగభద్రలో ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో నదీతీర గ్రామాల్లో అధికారులు అప్రమత్తత పెంచాలని స్థానికులు కోరుతున్నారు. వ్యవసాయ పనుల కోసం నదికి సమీప ప్రాంతాలకు వెళ్లే రైతులు, పశువుల కాపరులు, గ్రామస్థులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. వరద ప్రవాహం తగ్గే వరకు నదీ పరివాహక ప్రాంతాల్లో మొసళ్లు, ఇతర వన్యప్రాణుల సంచారంపై అటవీశాఖ ప్రత్యేక నిఘా పెట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. వన్యప్రాణులు జనావాసాల వైపు వస్తే ప్రజలకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా తక్షణమే స్పందించేలా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తుంగభద్ర వరద ప్రవాహం.. ఒడ్డున మొసలి ప్రత్యక్షం.. ఒక్కసారిగా హడలెత్తిన జనం! అయితే స్థానికులు అప్రమత్తంగా వ్యవహరించి మొసలిని బంధించడంతో పెను ప్రమాదం తప్పింది.

# నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో సాగర్ ఆయకట్టు రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు

- రైతన్నల కోసం పాదయాత్ర చేస్తా
- తారక రామారావు

నల్గొండ జిల్లా
వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 03

నల్గొండ జిల్లా మిర్యాలగూడలో నేడు ఏర్పాటు చేసిన బహిరంగ సభలో తారక రామారావు మాట్లాడుతూ సెప్టెంబర్ 14లోపు సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల షెడ్యూల్ ఇవ్వాలి లేకుంటే వేలాది మంది రైతులతో కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర 2003లో కేసీఆర్ పోరాట స్ఫూర్తితో మరో ఉద్యమానికి సిద్ధం రైతన్నల పంటలను కాపాడేందుకు మరోసారి పోరాటానికి సిద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద రైతుల పంటలు ఎండిపోతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నీటిని విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. సెప్టెంబర్ 14లోపు ఎడమ కాలువకు నీటిని ఎప్పుడు, ఎంత మేరకు విడుదల చేస్తారో స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలని ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. గడువులోగా స్పందించకపోతే వేలాది మంది రైతులతో కలిసి కోదాడ నుంచి హాలియా వరకు స్వయంగా పాదయాత్ర చేపడతానని ప్రకటించారు. మిర్యాలగూడ రైతు మహాధర్నాలో మాట్లాడిన కేటీఆర్.. సాగర్‌లో ప్రస్తుతం 180 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ ఎడమ కాలువ రైతులకు చుక్క నీరు ఇవ్వకపోవడం దారుణమన్నారు. నీళ్లు లేక కాదు.. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఈ సీజన్‌లో నీటిని విడుదల చేసే అవకాశం పూర్తిగా ఉన్నప్పటికీ ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ వ్యవసాయ రంగం దేశానికే ఆదర్శంగా నిలిచిందని కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ అన్నపూర్ణగా, ధాన్య భాండాగారంగా మారిందని చెప్పారు. ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ జిల్లా వరి ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిచిందని, తెలంగాణ రైస్‌బౌల్‌గా పేరుగాంచిన మిర్యాలగూడ పచ్చని మాగాణాలతో కళకళలాడిందని తెలిపారు. కానీ నేడు అదే ప్రాంతంలో రైతులు తమ పంటలకు నీళ్లు కావాలని ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. మిర్యాలగూడ మాత్రమే కాకుండా హుజూర్‌నగర్, నాగార్జునసాగర్, కోదాడ, సూర్యాపేట, నల్లగొండ, నకిరేకల్ సహా సాగర్ ఎడమ కాలువ కింద ఉన్న రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉందన్నారు. కేసీఆర్ పాలనలో ధీమాగా వ్యవసాయం చేసిన రైతులు నేడు పంటలు ఎండిపోతుంటే నీళ్లు వస్తాయో రావో తెలియని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికలకు ముందు రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. రెండు లక్షల రుణమాఫీ, రైతులకు పెరిగిన ఆర్థిక సాయం, కౌలు రైతులకు మద్దతు, పంటలకు బోనస్ వంటి హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు వాటిని విస్మరించిందని ఆరోపించారు. అడ్డగోలుగా హామీలు ఇచ్చి రైతులను మభ్యపెట్టారని మండిపడ్డారు రైతులు కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే నేడు మోసపోయామని భావించే పరిస్థితి వచ్చిందని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారి కళ్ల ముందే పంటలు ఎండిపోతున్నా స్పందించడం లేదని విమర్శించారు. సాగర్ ఎడమ కాలువ రైతుల సమస్య కోసం



2003లో కేసీఆర్ చేపట్టిన కోదాడ–హాలియా పాదయాత్రను కేటీఆర్ గుర్తుచేశారు. అప్పటి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువచ్చి రైతులకు నీరు విడుదల చేయించడంలో కేసీఆర్ విజయం సాధించారని చెప్పారు. అదే పోరాట స్ఫూర్తితో ఇప్పుడు మరోసారి రైతుల కోసం పాదయాత్రకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. "సెప్టెంబర్ 14లోపు ఎడమ కాలువకు నీటిని ఎప్పుడు విడుదల చేస్తారు? ఎన్ని తడులకు నీళ్లు ఇస్తారు? ఎంత మేరకు నీరు అందిస్తారు? అనే విషయాలపై స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలి. లేకుంటే వేలాది మంది రైతులతో కలిసి కోదాడ నుంచి హాలియా వరకు నేనే స్వయంగా పాదయాత్ర చేస్తా" అని కేటీఆర్ స్పష్టం చేశారు. నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో సాగర్ ఆయకట్టు రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని అన్నారు. జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు, నీటిపారుదల శాఖ రైతుల ఆవేదనను అర్థం చేసుకుని వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. రైతులను అనిశ్చితిలో ఉంచకుండా పంటలను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు

రైతులకు అండగా కేసీఆర్ ఉన్నారని, బీఆర్ఎస్ మొత్తం రైతాంగం పక్షాన నిలుస్తుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. అసెంబ్లీలోనూ రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, అక్కడ సమాధానం రాకపోతే ప్రజాక్షేత్రంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. రైతుల కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. నీళ్లు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి. ప్రభుత్వం స్పందించకపోతే కేసీఆర్ స్ఫూర్తితో రైతన్నలతో కలిసి పాదయాత్ర చేసి వారి హక్కుల కోసం పోరాడతాం అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

# రైతు కంట కన్నీరు.. సర్కారుకు కనిపించదా?

**ఎన్నికల హామీల అమలుపై నిలదీసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి):



ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నమ్మి కాంగ్రెస్‌కు పట్టం కట్టిన రైతులకు నిరాశే మిగిలిందని, ఎరువుల కోసం రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నా అన్నదాతల కన్నీటిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ విమర్శించారు. రైతుబీమా, రుణమాఫీ, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఇచ్చిన హామీల అమలు ఎక్కడికక్కడ నిలిచిపోయిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ చేపట్టిన రైతు సమస్యలపై ఏడు రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా గురువారం బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో నిర్వహించిన రైతు సమావేశంలో అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగు సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా సకాలంలో అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. యూరియా కోసం రైతులు దుకాణాల వద్ద బారులు తీరుతున్నారని, యాప్‌లలో మాత్రం నిల్వలు ఉన్నట్లు చూపించడం విడ్డూరంగా ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రైతులకు అండగా నిలిచామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుబీమా, రుణమాఫీపై స్పష్టత ఇవ్వడంతో పాటు సాగుకు అవసరమైన ఎరువులను సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. "అన్నదాత కంట కన్నీరు వస్తే ప్రభుత్వాలు కూలడం ఖాయం. రైతుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే ప్రజాగ్రహాన్ని ఎదుర్కోక తప్పదు" అని అనిల్ జాదవ్ హెచ్చరించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తుల శ్రీనివాస్, చెట్టు వినీల్, సర్పంచ్ సాయన్న, మండల కన్వీనర్ రాజారం, యువజన అధ్యక్షుడు శేఖర్, సుభాష్ గాడిగె, జాదవ్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# బోథ్‌లో కాంగ్రెస్ బైక్ ర్యాలీ.. భారీగా తరలివచ్చిన శ్రేణులు

**కేసీఆర్ వైఫల్యాలపై ఆడే గజేందర్ ధ్వజం**

ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి):



బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ బైక్ ర్యాలీతో కదం తొక్కాయి. బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, కేసీఆర్ ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో ర్యాలీ నిర్వహించారు. వందలాది బైక్‌లతో కార్యకర్తలు తరలి రావడంతో హస్తం నినాదాలతో మండల కేంద్రాలు మారుమోగాయి. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అప్పుల పాలైందని విమర్శించారు. అసెంబ్లీకి హాజరుకాకుండా ప్రజా సమస్యలను పట్టించుకోని కేసీఆర్‌కు ప్రతిపక్ష నేతగా కొనసాగే అర్హత లేదని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు, రైతు రుణమాఫీ, ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకుంటూ ప్రజా పాలన అందిస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కళ్లెం నారాయణరెడ్డి, కంచం లక్ష్మణ్, జిల్లా నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఏఎంసీ డైరెక్టర్లు, కాంగ్రెస్ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం మిలిటెంట్ పోరాటాలను నిర్మిస్తాం

- పీడీఎస్ యూ రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులు విజయవంతం
- అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పి. మహేష్, పాడపంగి నాగరాజు

నల్గొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 03



నల్గొండ పట్టణ కేంద్రంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్ యూ రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతులు సెప్టెంబర్ 1, 2, 2026 తేదీలలో నల్గొండ జిల్లా కేంద్రం లోని ఎస్.వి.ఆర్ గార్డెన్ లో విజయవంతంగా ముగిసాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్ మీట్ లో పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాడపంగి నాగరాజు లు మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగిన రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులు విజయవంతంగా ముగిసాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ఎంపికైన విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. ప్రొఫెసర్స్, టీచర్స్, ప్రజా సంఘాలు, ప్రజా ఉద్యమ నాయకులు హాజరై విద్యార్థులకు అనేక అంశాలపై శిక్షణ కల్పించడం జరిగిందన్నారు. విద్యారంగ సమస్యలను చర్చించడం జరిగిందని, రాష్ట్రంలో మిలిటెంట్ ఉద్యమాలు నిర్మించేందుకు తగిన కార్యచరణను నిర్దేశించుకోవడం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యారంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులను పెద్ద ఎత్తున కదిలించి పోరాటాల నిర్మిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ ఉమ్మడి జిల్లా ఇంచార్జి ఇందూరు సాగర్, జిల్లా అధ్యక్షులు పోలె పవన్, ప్రధాన కార్యదర్శి కామల్ల సంజయ్, నాయకులు అంబటి శ్రీనాద్, ఇందూరు లోకేష్, గౌతమ్, వేణు, సంతోష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో అవినీతి, అరాచకాలు

**బీజేపీ రాష్ట్ర నాయకులు పాలకూరి రవి గౌడ్**

నల్గొండ, జిల్లా వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 03



నల్గొండ పట్టణ కేంద్రంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు కానీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలు ఎందుకు అమలు కావడం లేదు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల పై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు మాట నిలబెట్టుకోవడం లేదు విఫలమైందని వెయ్యి రోజుల పాలనలో ప్రజా సమస్యల పరిష్కారం కంటే అవినీతి, అరాచకాలు, రాజకీయ కక్ష సాధింపులకే ప్రాధాన్యత లభిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలు, వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ప్రశ్నించారు. "మహిళలకు, రైతులకు, యువతకు, విద్యార్థులకు, వృద్ధులకు, పేదలకు ఇచ్చిన హామీల పరిస్థితి ఏమిటి? ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, ఉద్యోగాలు, రైతుల సమస్యలు, ఇళ్ల నిర్మాణం వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన లెక్కలు ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. వెయ్యి రోజుల పాలనపై గొప్పలు చెప్పుకోవడం కాదు ప్రజలకు ఇచ్చిన హామీలను ఎన్ని అమలు చేశారో ముందుగా లెక్క చెప్పాలి. అవినీతి, అరాచకాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలి అని పాలకూరి రవి గౌడ్ డిమాండ్ చేశారు.

# నాణ్యమైన విద్య, వసతులే ప్రభుత్వ ధ్యేయం

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి):



విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. గురువారం బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఎస్సీ బాలుర వసతి గృహాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్యతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బజార్‌హత్నూర్‌లో ఎస్సీ, బీసీ హాస్టళ్ల నూతన భవనాల నిర్మాణానికి త్వరలో పరిపాలనా అనుమతులు రానున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు త్వరలో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులతో పాటు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, ఖాన్ అకాడమీ ద్వారా డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కొత్త యూనిఫాంలు, షూలు అందించనున్నట్లు వెల్లడించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. మండలంలో పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సునీతకుమారి, ఎంఆర్ఓ శ్యాంసుందర్, ఎంపీడీవో మహేందర్, సర్పంచ్ సాయన్న, ఎంఈవో రాంకిషన్, ఏఏపీసీ చైర్మన్ నవనీత, ప్రధానోపాధ్యాయుడు భూమన్న, వార్డెన్ చైతన్యతో పాటు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )



కాగజ్ నగర్ మండలం బారేగూడ గ్రామ పంచాయతీ పరిధిలో ఈ రోజు రూ.12 లక్షల రూపాయల అంచనాతో నిర్మించిన నూతన అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించిన సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు మరియు గర్భిణీ మహిళలకు పౌష్టికాహారం లోపం లేకుండా ప్రభుత్వం ఈ ఐసిడిఎస్ పథకాన్ని చేపడుతుందని , ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ గ్రామంలో ఉన్న సమస్యలను గ్రామ సర్పంచ్ కోట వేణు యాదవ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ స్వరూప, సీడీపీఓ రెబెకా, సూపర్వైజర్ లు స్పందన, చందన, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 9వ వార్డ్ లో సర్ -2 నోటీసుల పంపిణీ

మంచిర్యాల /రామకృష్ణాపూర్ /సెప్టెంబర్ 03(వు దయం ప్రతినిధి)



తెలంగాణ సర్–2 ప్రక్రియలో భాగంగా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వార్డు నెంబర్ 19లో ఓటర్లకు నోటీసుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ,స్థానిక కౌన్సిలర్ రంగ లక్ష్మి, మాజీ వార్డ్ మెంబర్ రంగరాజు, సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్ లు పాల్గొన్నారు.2002 ఓటర్ల జాబితా ప్రకారం తల్లిదండ్రుల పేర్లు, వయస్సు, ఇంటిపేరు తదితర వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు ఎన్నికల సంఘం తరఫున నోటీసులు అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నోటీసులో సూచించిన విధంగా సంబంధిత ఓటరు, వారి తల్లిదండ్రులకు సంబంధించిన ఆధార పత్రాలను జతచేసి నిర్ణీత గడువులోగా బీఎల్ఓలకు అందజేయాలని కమీషనర్ సూచించారు. ప్రతి అర్హత కలిగిన ఓటరుకు నోటీసులు అందేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ఆధార పత్రాలను సమర్పించి సర్–2 ప్రక్రియకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు పచ్చిక లక్ష్మారెడ్డి, బిఎల్ఓ లు మంజుల, సరిత, బిఎల్ఎ పందిన సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్ల పంపిణీ

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 03 (వుదయం న్యూస్):



మండలంలోని ఆర్ఎంపి, పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వెంకట్రావుపేట ప్రథమిక ఆరోగ్య కేంద్రం లో క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా పోషకాహార కిట్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్ పాల్గొని కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, వెంకట్రావుపేట ప్రాథమిక ఆఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సమత ,జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్ క్షయ వ్యాధి నియంత్రణ కోఆర్డినేటర్ సురేందర్ , సూపర్‌వైజర్ సురేష్ , హెచ్ఈఓ దేవేందర్, హెల్త్ అసిస్టెంట్స్ వేణు, గఫూర్, ఇసాక్ అహ్మద్, ఆశావర్కర్స్ పాల్గొన్నారు.

# 5, 6, 12, 13 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు

నిజామాబాద్, వుదయం, సెప్టెంబర్ 3 :



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 5, 6, 12, 13 తేదీలలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం (స్పెషల్ క్యాంపెయిన్) నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. మొదటి విడతగా 5, 6 తేదీలలో, రెండవ విడతగా 12, 13వ తేదీలలో స్పెషల్ క్యాంపెయిన్ కొనసాగుతుందన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు సందర్భంగా ప్రతి బూత్ లెవల్ అధికారి (BLO) తమకు కేటాయించిన నిర్దేశిత ప్రదేశంలో అందుబాటులో ఉంటారని అన్నారు. ఓటర్లకు అవసరమైన ఫారం–6, ఫారం–7, ఫారం–8లతో పాటు ముసాయిదా ఓటరు జాబితాను అందుబాటులో ఉంచడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన వారు ఫారం–6 ద్వారా, ఓటరు జాబితాలోని పేర్ల తొలగింపు లేదా అభ్యంతరాలకు ఫారం–7 ద్వారా, ఓటరు వివరాల్లో మార్పులు, సవరణలు, చిరునామా మార్పు వంటి వాటికి ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సంబంధిత బూత్ లెవల్ అధికారులతో పాటు బూత్ లెవల్ ఏజెంట్లు కూడా అందుబాటులో ఉండాలని, ముసాయిదా ఓటరు జాబితాను ఓటర్లు పరిశీలించేందుకు సహకరించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవడంతో పాటు, అవసరమైన సవరణలు, మార్పులు లేదా కొత్తగా ఓటరు నమోదు కోసం స్పెషల్ క్యాంపెయిన్ రోజుల్లో తమ సమీప పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)




కాగజ్నగర్ లోని మండల విద్యా వనరుల కేంద్రం లో కాగజ్నగర్ డివిజన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించినట్లు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విలీన విద్య కోఆర్డినేటర్ కొయ్యడ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, పాఠశాల స్థాయిలో విద్యాశాఖ నిర్వహించే అన్ని కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల ఆధార్, అపార్ మరియు డ్రాబాక్స్ కు సంబంధించిన వివరాలు అన్నీ కూడా ఆన్లైన్లో యుడైస్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ముఖ్య అతిథి కొయ్యడ శ్రీనివాస్ మాట్లాడుతూ చాలా ప్రైవేట్ పాఠశాలల్లో ప్రసిద్ధ మరియు స్వచ్ఛ విద్యాలయ యాప్ లను రిజిస్ట్రేషన్ పూర్తి చేసి పాఠశాలల వివరాలు ఈనెల తొమ్మిదవ తారీకు లోపల పూర్తి చేయాలని సూచించారు. ఇన్స్పైర్ అవార్డ్స్ ఆన్లైన్లో నమోదు చేయని పాఠశాలల ప్రధానోపాధ్యాలు ఈనెల ఆరవ తారీకు లోపు కచ్చితంగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంచికలపేట మండల విద్యాధికారి. తోట రమేష్ ఎం ఆర్ సి సిబ్బంది శ్రీకాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల దాడిలో వృద్ధుడి మృతి

దండేపల్లి: సెప్టెంబర్ 03 (వుదయం విలేకరి)

దండేపల్లి మండల కేంద్రానికి చెందిన ఒరగంటి పోషం (80) గత కొంతకాలంగా వృద్ధాప్యం వల్ల అనారోగ్యంతో లేవలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యాడు.ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఐదు వీధి కుక్కలు ఒక్కసారిగా ఆయనపై పడి విచక్షణారహితంగా దాడి చేశాయి.

శరీరమంతా కుక్కలు తీవ్రంగా కొరకడంతో ఘటనా స్థలంలోనే విలవిలలాడుతూ మృతి చెందాడు.ఈ దారుణ ఘటనతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు వీధి కుక్కల సంచారం ఎక్కువై ప్రాణాలు తీస్తున్నాయని,అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.




# టెక్నాలజీతో సాగు.. రైతుకు లాభాల బాట

**కిసాన్ మేళాలో ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి**

ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి):

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబించినప్పుడే రైతులు అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధించగలరని ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మావల మండలంలోని చిలుకూరి లక్ష్మి గార్డెన్‌లో ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళాలో ఆయన పాల్గొన్నారు. రైతులు దళారులపై ఆధారపడకుండా మార్కెట్ యార్డులు, మార్కెట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్ సాంకేతికత, నూతన సాగు విధానాలపై రైతులు అవగాహన పెంచుకోవాలని అన్నారు..

# శ్రీ సరస్వతీ విద్యామందిర్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ గోనె లహరి**

ఆర్మూర్, సెప్టెంబరు 3, (వుదయం ప్రతినిధి) :



ఆర్మూర్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల శ్రీ సరస్వతీ విద్యామందిర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొనగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని శ్రీకృష్ణుని బాల్య లీలలను, భక్తి భావాన్ని ప్రతిబింబించేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై పాఠశాలకు రావడంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది. కొందరు విద్యార్థులు కృష్ణుడి వేషధారణలో వేణువు పట్టుకుని, నెమలి పింఛంతో అలంకరించుకుని సందడి చేశారు. చిన్నారుల ముద్దుముద్దు వేషధారణలు, హావభావాలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ గోనె లహరి హాజరై చిన్నారులను అభినందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. పాఠశాల ప్రాంగణం అంతా 'గోవిందా.. గోపాలా' నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో పాఠశాల ప్రబంధకారిణి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# సంక్షేమానికి పెద్దపీట.. అభివృద్ధికి కొత్త బాట

- వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు భరోసా
- ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి

ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి):



ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి కొత్త బాటలు వేస్తోందని ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ప్రజా పాలన వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్‌లతో కలిసి గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు, మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాలకు భరోసా కల్పించడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని, వాటికి ప్రజలే సరైన సమాధానం చెబుతారని అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయాన్ని ప్రధాన ఎజెండాగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకట్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ కొండా గంగాధర్, అభిషేక్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుంద్ర నర్సింగ్, తంతోలి గ్రామ నాయకులు వీరయ్య, రాజేశ్వర్, దండు మధుకర్, సత్మరం, రాములు, రవి, వినోద్‌రెడ్డి, పోచారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీ కాల్వకు నీటిని విడుదల చేయాలి

- 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై 2వ రోజు బగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు రైతులు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకాకపోతే గద్దె దిగిపోండి
- వర్ధన్నపేట మండలం కట్య్రాల కెనాల్ నుండి రాందాన్ కుమ్మరి గూడెం తండా వరకు రైతులతో కలిసి ఎండిపోయిన ఎస్ ఆర్ ఎస్ పి పేజ్ 1 కాలువ వెంబడి పాదయాత్రలో క్రికెట్ , బాల్ బ్యాట్మింటన్ ఆడి నిరసన తెలిపిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్

**వర్ధన్నపేట , సెప్టెంబర్ 03 ( వుదయం ప్రతినిధి ):**

ఎస్సారెస్పీ కాలువ ద్వారా చెరువులకు సాగు నీరు అందించాలని, కండ్ల ముందే వందల ఎకరాలు సాగు చేయకుండా పొలాలను రైతులు పక్కన పెట్టిన, అలాగే వరి సాగు వేసిన వారికి సాగు నీరు అందక ఎండి పోతున్న కూడా ఈ ప్రభుత్వానికి సాగు నీరు విడుదల చేసి ఆదుకోవాలనే చిత్త శుద్ధి లేదని మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మండిపడ్డారు. కాల్వల ద్వారా నీటిని విడుదల చేసి పంట పొలాలకు సాగు నీరు అందించాలని , వర్ధన్న పేట మండలం మెయిన్ కెనాల్ నుండి రాందాన్ కుమ్మరి గూడెం తండా వరకు రైతులతో కలిసి ఎండిపోయిన ఎస్ ఆర్ ఎస్ పి పేజ్ 1 కాలువ వెంబడి పాద యాత్ర కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ చేపట్టినారు. అనంతరం ఆరూరి రమేష్ మాట్లాడుతూ మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రైతులను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. వర్షాకాలంలో కాలువ వస్తుందనే ఆశతో రైతులు వరి నాట్లు వేశారని ఇప్పుడు నీరు రాకుంటే రైతులకు ఎకరాకు 25 వేల రూపాయలు నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో వరి నాట్లు వేసిన రైతు పంటలు ఎండి పోయే పరిస్థితి నెలకొందన్నారు. అధికారులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్న ప్రభుత్వం నీరు విడుదల చేయొద్దని తెలిపారని అని చెప్తున్నారు. రోజుకో సభ పేరు చెప్పి ప్రజల సొమ్ము గుల్ల చేసుడు తప్ప రైతులకు ఏమి చెయ్యాలో తెలియని వ్యక్తి సిఎం గా ఉండడం సిగ్గుచేటన్నారు. పంట కోసం పెట్టిన పెట్టుబడులు రైతులకు భారంగా మారాయని తెలిపారు. రైతుల పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని, సాగునీరు అందించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని ఆరూరి రమేష్ స్పష్టం చేశారు.

రైతు బంధు ఎగగొట్టి ఇప్పటికే ఈ ప్రభుత్వం రైతులను ఆగం చేస్తుంది. యూరియా దొరకక, కరెంట్ కష్టాలతో ఇప్పటికే రైతులు ఆగం అతున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్ధన్నపేట , పర్వతగిరి, ఐనవోలు మండల నాయకులు మండల పార్టీ అధ్యక్షులు తుళ్ళ



కుమారస్వామి , ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు , తంపుల మోహన్ , మాజీ ప్రజా ప్రతినిధులు మార్గం బిక్షపతి , గుజ్జ గోపాల్ రావు , గుజ్జ సంపత్ రెడ్డి ,పట్టణ అధ్యక్షులు గోధుమల మధుసూదన్ , దుగ్యాల మాధవరావు ,వర్ధన్న పేట మున్సిపల్ కౌన్సిలర్లు గుజ్జ వీర రాఘవ రావు ,పట్టపురం యాకంత గౌడ్ ,ఏం.మనోజ్ కుమార్ , బోయినపల్లి యుగేందర్ రావు , చిన్నపాక శ్రీనివాస్ , ఆమడగాని రాజు యాదవ్ ,రంగు కుమార్ , దెక్క సునీత – కుమార స్వామి , బోట్ల మధు , మట్టపెల్లి వంశీ రావు , తక్కళ్లపెల్లి చందర్ రావు , ఎండీ. ఉస్మాన్ అలీ , ఐనవోలు దేవస్థానం మాజీ చైర్మన్ సమ్మయ్య , మాజీ జడ్పీటీసీ , మాజీ కౌన్సిలర్లు , ఆయా గ్రామాల సర్పంచ్ లు , మాజీ ఎంపీటీసీ , రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీఎఫ్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు

**పర్వతగిరి , సెప్టెంబర్ 03 ( వుదయం ప్రతినిధి ):**



పర్వతగిరి మండలం ఆర్డీఎఫ్ కల్లెడ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధా వేషధారణలో అలరించారు. పాఠశాల ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, కృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాస్, ఇన్‌చార్జులు జి. రమేష్, ఏ. సంతోష్, పాఠశాల ఏ.ఓ. ఎస్. రాజు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. సంప్రదాయ పద్ధతిలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించారు.

## కాంగ్రెస్ 1000 రోజుల పాలన సంబరాలు



**కేక్ కట్ చేసి, భారీ ర్యాలీ నిర్వహించిన డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**

**హసన్ పర్తి, సెప్టెంబర్3 (వుదయం ప్రతినిధి):**

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా హనుమకొండ జిల్లా డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రాంరెడ్డి కేక్ కట్ చేసి భారీ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా 1000 రోజుల ప్రజా పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం ఎర్రగట్టు గుట్ట జంక్షన్‌లో గురువారం పార్టీ శ్రేణులు సంబరాలు జరుపు కున్నారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మధ్య కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన కార్యకర్తలతో కలిసి భారీ ఎత్తున విజయ ర్యాలీ నిర్వహించారు. రహదారి పొడవునా కాంగ్రెస్ జెండాలు చేతబూని, ప్రభుత్వ విజయోత్సవ నినాదాలతో సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు మాట్లాడుతూ గడిచిన 1000 రోజులుగా కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతోందని కొనియాడారు. ప్రజా పాలనలో ఇచ్చిన హామీలన్నింటినీ రేవంత్ రెడ్డి సర్కార్ అంచెలంచెలుగా నెరవేరుస్తోందని, రాబోయే రోజుల్లో సంక్షేమ పథకాలను మరింత వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఈ సంబరాల్లో 66, 65,1 వ డివిజన్ అధ్యక్షులు గొర్రె కిరణ్, నేదునూరి సునీల్, చిర్రా రాము గౌడ్, మండల అధ్యక్షుడు అశోక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జెడ్ పి హెచ్ ఎస్ పర్వతగిరి పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**పర్వతగిరి , సెప్టెంబర్ 3 ( వుదయం ప్రతినిధి ):**



పర్వతగిరి మండల కేంద్రం లోని జెడ్పిహెచ్ఎస్ పర్వతగిరి పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఉట్టి కొట్టుడు కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులు సంతోషంగా నిర్వహించారు. చివరిగా పదవ తరగతి విద్యార్థి పి.కళ్యాణ్ ఉట్టి కొట్టి తన చాతుర్యాన్ని శక్తిని చాటి చెప్పాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుకూరి నవీన్ కుమార్, మాట్లాడుతూ సంస్కృతీ సాంప్రదాయాలను ప్రతిబింబించే ఇలాంటి పండుగలు ప్రజల్లో సంతోషాన్ని శాంతిని నీతిని బోధిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం



- తొర్రూరులో 1000 రోజుల విజయోత్సవ సంబరాలు
- భారీ బైక్ ర్యాలీ.. టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ

**తొర్రూరు సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి):**

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం 1000 రోజుల్లో అన్ని వర్గాలకు న్యాయం చేసేలా ముందుకు సాగిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. టపాసులు కాల్చి,మిఠాయిలు పంపిణీ చేసి వెయ్యి రోజుల విజయోత్సవ సంబరాలు నిర్వహించారు.మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు ముద్దసాని సురేష్ లతో కలిసి రవీంద్ర చారి మాట్లాడారు.ఈ వెయ్యి రోజుల పండుగలో అన్ని రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని.. రైతులు, మహిళలు, వ్యవసాయ కూలీలు, బలహీనవర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని చెప్పారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిచ్చి రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీ ద్వారా దాదాపు 25.35లక్షల మంది రైతులకు రుణ విముక్తి కలిగించిందన్నారు. రైతు భరోసాను ఎకరానికి రూ.12వేలకు పెంచి, ఇప్పటివరకు రూ.36వేల కోట్లు అందించామని తెలిపారు. సన్న వడ్ల బోనస్‌కు రూ.4 వేల కోట్లు, ఉచిత విద్యుత్తుకు రూ.30 వేల కోట్లు, రైతు బీమాకు రూ.3,500 కోట్లు కేటాయించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం బలోపేతం చేసిందని స్పష్టం చేశారు. గృహజ్యోతి కింద 200యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.500కే ఎల్పీజీ సిలిండర్, 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం జారీచేసిందన్నారు. యువతకు ఉపాధి, విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్య మిస్తూ 70 వేలకు పైగా ప్రభుత్వ నియామకాలు పూర్తి చేశారని పేర్కొన్నారు.

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాలు పేదలకు అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వెంకన్న యాదవ్, సీనియర్ నాయకులు మేకల కుమార్, గుండాల నరసయ్య, గంజి విజయపాల్ రెడ్డి, చిత్తలూరి శ్రీనివాస్, కందాడి అచ్చిరెడ్డి,చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, జక్కా మహబూబ్ రెడ్డి, చెవిటి సధాకర్,నల్లమాస సమ్మయ్య, రామ్ రెడ్డి,సురేందర్ రాజు,వెంకటాచారి,దొంగరి శంకర్,రాజేష్ యాదవ్, సర్పంచ్ లు వెంకట్ రెడ్డి, బానోత్ శీను,బానోత్ బిక్షపతి, బంగారు రమేష్,జాటోత్ రాంలాల్, మాధవరెడ్డి,యూత్ పట్టణ అధ్యక్షుడు మహేష్ యాదవ్,నాయకులు సోమిరెడ్డి, దేవేందర్ రాజు,వెలుగు మహేశ్వరి, అనిత,అశోక్ రెడ్డి, దీకొండ శ్రీను,అనిల్, రాంబాబు, అజ్మీర రమేష్,జగన్,అరవింద్, శ్రీనివాస్,వెంకన్న,ఎర్రం రాజు తదితరులు పాల్గొన్నారు.

## దర్గా ఊరూరా పోచమ్మ బోనాలు

**కాజీపేట్ సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి)**



కాజీపేట్ మండలం దర్గా ప్రాంతంలో ఊరూరా పోచమ్మ కు బోనాలు నిర్వహించారు భక్తులు బోనాలతో ఊరేగింపుగా మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో డబ్బు చప్పులతో బోనాలు నెత్తిన పెట్టుకొని పోచమ్మ ఆలయ వద్దకు వెళ్లి బోనాలు పట్టు వస్త్రాలను సమర్పించారు. 48,49 డివిజన్ మాజీ కార్పొరేటర్లు అబూబక్కర్, మానస రాంప్రసాద్ డివిజన్ అధ్యక్షుడు,చందు మాజీ డివిజన్ ఇంచార్జ్ సింగారావు రవి ప్రసాద్ గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు అన్ని పార్టీ సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ప్రకృతి వ్యవసాయంతో నేల ఆరోగ్యం.. రైతులకు మేలు

**ఏవో విజయ్ కుమార్**

**వర్ధన్నపేట సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి):**

రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వనరులతో ఆరోగ్యకరమైన పంటల సాగును ప్రోత్సహించడమే లక్ష్యంగా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నల్లబెల్లి క్లస్టర్ పరిధిలోని చంద్రు తండా గ్రామ పంచాయతీలో గురువారం నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ (NMNF) ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. విజయ్ కుమార్, NFSM కన్సల్టెంట్ సారంగం, వ్యవసాయ విస్తరణ అధికారి ఆర్. శిరీష, చంద్రు తండా, రాందాన్ తండా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో రసాయన ఎరువులు, పురుగుమందులపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చన్నారు. స్థానికంగా లభించే సహజ వనరులను వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు జీవ వైవిధ్యాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు.వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించారు.

ద్రవ జీవామృతం తయారీపై డెమోసదస్సులో ద్రవ జీవామృతం తయారీపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. 10 కిలోల తాజా ఆవు పేడను 180 లీటర్ల నీటిలో కలిపి, 8–10 లీటర్ల ఆవు మూత్రం, 1.5–2 కిలోల బెల్లం, 1.5–2 కిలోల శనగపిండి లేదా పప్పిండి, ఒక పిడికెడు చెట్టు కింద మట్టిని కలిపి కిణ్వ ప్రక్రియ ద్వారా ద్రవ జీవామృతాన్ని తయారు చేసే విధానాన్ని అధికారులు రైతులకు వివరించారు. సిద్ధమైన జీవామృతాన్ని ఎకరానికి సుమారు 200 లీటర్ల చొప్పున వినియోగించవచ్చని, పంట పరిస్థితిని బట్టి నెలకు ఒకటి నుంచి రెండుసార్లు ఉపయోగించవచ్చని సూచించారు.అలాగే ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే అగ్ని అస్త్రం, జీవామృతం వంటి సహజ పద్ధతుల ప్రాధాన్యతను, చీడపీడల నివారణలో వాటి వినియోగంపై రైతులకు శిక్షణ ఇచ్చారు.అనంతరం అధికారులు రైతుల పంట క్షేత్రాలను సందర్శించి పంటల పరిస్థితిని పరిశీలించారు. పంటల నిర్వహణ, చీడపీడల నివారణతో పాటు ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించారు.

## గుడుంబా విక్రయిస్తున్న మహిళ పట్టివేత

**5 లీటర్ల గుడుంబా స్వాధీనం**

**చిట్యాల: సెప్టెంబర్ 03(వుదయం ప్రతినిధి)**

చిట్యాల గ్రామ పరిధిలో అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న ఒక మహిళను పట్టుకొని, ఆమె వద్ద నుండి 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ తెలిపారు. గురువారం చిట్యాల హెడ్ కానిస్టేబుల్ వి. చంద్రమౌళి తమ సిబ్బందితో కలిసి చిట్యాల గ్రామ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒక మహిళ ప్లాస్టిక్ క్యాన్‌తో అనుమానాస్పదంగా ఉండటాన్ని గమనించారు. తనిఖీ చేయగా ఆ క్యాన్‌లో 5 లీటర్ల నిషేధిత నాటుసారా లభ్యమైంది.విచారణలో సదరు మహిళ పాశిగడ్డ తండా గ్రామానికి చెందిన జార్పుల ఉష (36), అని తెలిసింది. ఆమె వద్ద ఉన్న సుమారు రూ. 2,000/– విలువ గల 5 లీటర్ల గుడుంబాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు అని తెలిపారు. మండల పరిధిలోని గ్రామాలలో ఎవరైనా గుడుంబా తయారు చేసినా, అక్రమంగా నిల్వ ఉంచినా లేక విక్రయించినా వారిపై చట్టపరంగా అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారాన్ని వెంటనే పోలీస్ స్టేషన్‌కు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రోటోకాల్ ఉల్లంఘనపై తీవ్ర ఖండన

**బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ తంపుల మోహన్**

**ఐనవోలు , సెప్టెంబర్ 03 ( వుదయం ప్రతినిధి ):**



ఐనవోలు మండల కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే నాగరాజు పర్యటన సందర్భంగా, స్థానిక గ్రామ సర్పంచ్‌ను ప్రోటోకాల్ ప్రకారం కార్యక్రమానికి ఆహ్వానించకపోవడం తీవ్రంగా ఖండి స్తున్నామని బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ తంపుల మోహన్ పేర్కొన్నారు. ఐనవోలు మండలంలోని సర్పంచులకు ప్రతిపక్షం అనే కారణంతో అభివృద్ధి కార్యక్రమాలకు దూరం పెట్టడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం, సిగ్గుచేటు అని అన్నారు. గ్రామానికి ఎన్నికైన సర్పంచ్‌ను అధికారిక కార్యక్రమాల్లో ప్రోటోకాల్ ప్రకారం గౌరవించడం అధికారుల బాధ్యత అని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులందరికీ సమాన గౌరవం, ప్రోటోకాల్ పాటించాలన్నారు. అదేవిధంగా, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ప్రైవేట్ ఆసుపత్రికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించడంపై కూడా అధికారులు స్పష్టత ఇవ్వాలన్నారు. ప్రోటోకాల్ ఉల్లంఘనకు, ప్రభుత్వ ఆసుపత్రి వేదిక వినియోగంపై నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై తక్షణమే విచారణ జరిపి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులను రాజకీయాలకు అతీతంగా గౌరవించడం, ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించడం అధికారుల బాధ్యత అని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తంపుల మోహన్ తెలిపారు.

## చిన్నారిని ఆశీర్వదించిన మాజీ ఎంపీపీ వేములపల్లి

**ఖానాపురం, సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి):**



మండల కేంద్రానికి చెందిన కేసోజు విజయ్ ప్రియాంక దంపతుల కుమార్తె వస్త్ర అలంకరణ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు హాజరై చిన్నారి కేసోజు లాస్యపై పుష్ప అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్, వార్డు సభ్యుడు గుండ్లపల్లి విజయ్,నాయకులు ప్రభాకర్ రావు, రాములు, కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ టాయిలెట్లకు స్థల పరిశీలన భూమి పూజ



**మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత**

**ఖానాపురం, సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి):**

పారిశుధ్యాన్ని మెరుగుపరచడంలో భాగంగా ప్రజల సౌకర్యార్థం నూతన సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలను చేపడుతున్నట్లు మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత మండల ప్రజలకు తెలిపారు. మండలంలోని బుదరావుపేట గ్రామపంచాయతీ పరిధిలోని వీఓ భవనం సమీపంలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణానికి గురువారం స్థలాన్ని పరిశీలించి నిర్మాణ పనులకు భూమి పూజ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెసరు రాణి, ఎంపీఓ సునీల్ కుమార్, ఈసీ అరుణ్, పంచాయతీ కార్యదర్శి బాలు, టీఏ వీరబాబు, నాయకులు బిక్కి మురళి, మోడెం ఎల్లగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ధర్మసాగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా అనుముల శ్రీనివాస్

**ధర్మసాగర్, సెప్టెంబర్ 03 వుదయం ప్రతినిధి**

ఈరోజు ధర్మసాగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సి.ఐ)గా అనుముల శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు.బదిలీల్లో భాగంగా ఇక్కడికి నియమితులైన ఆయన, పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణే తన మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. లా అండ్ ఆర్డర్ పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన సీఐ అనుముల శ్రీనివాస్‌కు సర్కిల్ పరిధిలోని ఎస్సైలు,పోలీస్ సిబ్బంది మరియు పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కాంపౌండ్ వాల్ పనులు తక్షణమే నిలిపివేయాలి

**భూపాలపల్లి: సెప్టెంబర్,03(వుదయం విలేకరి)**



మేడిపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గొరిగె కిరణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు ముందుగా గ్రామసభ నిర్వహించి, గ్రామసభ ద్వారా నిబంధనల ప్రకారం వీడీసీ కమిటీని ఏర్పాటు చేసిన తర్వాతే పనులు ప్రారంభించాలని తెలిపారు వీడీసీ ఏర్పాటు, సభ్యుల ఎంపిక, అధ్యక్షుడి ఎంపిక, తీర్మానాలపై వస్తున్న ఫిర్యాదులను అధికారులు సమగ్రంగా విచారించాలని కోరారు. తీర్మాన పుస్తకం, హాజరు పట్టిక, సభ్యుల సంతకాలు, సమావేశ వివరాలు, కమిటీ ఏర్పాటు ప్రక్రియను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని అన్నారు. వీడీసీ లో స్థానిక గ్రామస్థులకే ప్రాధాన్యత కల్పించాలని, ఇతర గ్రామాలకు చెందిన వ్యక్తులకు బాధ్యతలు అప్పగించినట్లయితే వారి అర్హత, ఎంపిక విధానం, అధికారిక అనుమతులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.విచారణ పూర్తయ్యే వరకు వీడీసీ తీర్మానాల ఆధారంగా ఎలాంటి పనులు చేపట్టకుండా, కాంపౌండ్ వాల్ పనులను నిలిపివేయాలని కోరారు. నిబంధనల ఉల్లంఘనలు లేదా అవకతవకలు తేలితే బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## కోళ్ల గూటిపై నాగుపాము దాడి

**భూపాలపల్లి: సెప్టెంబర్ 03(వుదయం ప్రతినిధి)**



వాతావరణంలో మార్పులు, వర్షాలు లేదా ఉక్కపోత వల్ల అడవులు, పొదల్లో ఉండాల్సిన నాగుపాములు చల్లని ప్రదేశాల కోసం ఆహారం ఎలుకలు మొదలైనవి వెతుక్కుంటూ ఇళ్లలోకి వస్తుంటాయి.దానిలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఆనంద్ అనే వ్యాపారి ఇంట్లో నాగుపాము హల్‌చల్ చేసింది. కోళ్ల గూటిపై దాడి చేసి గుడ్లపై పొదిగిన కోడిని కాటేసి, గుడ్లను మింగేసింది. భయాందోళనకు గురైన ఇంటి యజమాని స్నేక్ క్యాచర్ కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకుని పామును పట్టుకుని సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. పామును పట్టుకుని తీసుకోవెళ్లడంతో భయాందోళనకు గురైన ఆనంద్ కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

## బ్రిలియంట్ గ్రామర్ స్కూల్ లో కృష్ణాష్టమి వేడుకలు



**ఖానాపురం, సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి):**

మండలంలోని బుధరావుపేట గ్రామంలోని బ్రిలియంట్ గ్రామర్ స్కూల్లోని విద్యార్థులు కృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా విద్యార్థులు కృష్ణుని వేషాధారణలో, గోపికమ్మ వేషాధారణలో ఆటపాటలతో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలను విద్యార్థులు ఉపాధ్యాయ బృందం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ సుబ్బారావు, ఉపాధ్యాయులు రాజు, వెంకటేష్, రాజు, సలీం పాషా, పావని, స్వరూప, విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బ్లూమింగ్ బర్డ్స్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు



**రాయపర్తి సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి):**

బ్లూమింగ్ బర్డ్స్ స్కూల్‌లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు.శ్రీకృష్ణుడి బాల్య లీలలు, గోపికల వేషధారణ, భక్తి గీతాలు, నృత్య ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని కృష్ణాష్టమి పండుగ విశిష్టతను చాటి చెప్పారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ /కరస్పాండెంట్ ఎనగందుల సంతోష్ మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరియు పండుగల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు, వాటిపై అవగాహన కల్పించేందుకు పాఠశాలలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని చూపించిన ప్రదర్శనలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కీ.శే. విమలమ్మ, కీ శే. బొంపల్లి పుష్పలత చిత్రపటాలకు నివాళులర్పించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**పర్వతగిరి , సెప్టెంబర్ 03 :**



పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గురువారం కీ.శే. సంపెల్లి విమలమ్మ , కీర్తిశేషులు బొంపల్లి పుష్పలత ఇటీవల మృతి చెందిన కుటుంబ సభ్యులను సంపెల్లి సంపత్ రావు , కిషన్ రావు , బోపెల్లి అరవింద్ రావు , ప్రసాద్ రావు , భాస్కర్ రావు లను పరామర్శించి చిత్రపటాలకు నివాళులు అర్పించి నారు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ పరామర్శ లో మాజీ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రంగు కుమార్ , పర్వతగిరి మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు , కరిమిళ్ల దుర్గారావు , పదిదెల స్వామిరావు ,గ్రామ సర్పంచి సునీత – కుమారస్వామి , 3 వ వార్డు మెంబెర్ రావుల యాక లక్షి ,జుట్టు కొండ నాగయ్య ,రమేష్ ,చందసాని అశోక్ , పట్టపురం కొమురయ్య , పంతంగి ప్రవీణ్ , పల్లె ప్రకాష్ , పట్టపురం రాజు , తదితరులు పాల్గొన్నారు.

## రహదారి ఇలా మరి ప్రయాణం ఎలా..?

- మరమ్మతులు చేపట్టడంలో నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

**మహాదేవపూర్: సెప్టెంబర్ 03(వుదయం ప్రతినిధి)**



మహాదేవపూర్ మండలకేంద్రంలోని పలు వీధులలో గుంతల మయమైన రోడ్లతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని రోడ్లకు మరమ్మతులు చేసేందుకు మాత్రం ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదనతో ఆరోపించారు.వర్షాకాలం కావడంతో కురిసిన వర్షాలకు డ్రైనేజీ సౌకర్యాలు లేక రహదారిపై ఉన్న గుంతలలో నీరు నిలిచి ఉండడంతో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని మరమ్మతులు చేపట్టడంలో నిర్లక్ష్యం వహించడంతోపాటు పట్టించుకునే వారే కరువుతున్నారని ఆరోపిస్తున్నారు.గుంతలుగా ఏర్పడిన రహదారిపై ప్రయాణం ఎలా కొనసాగించుట అని వాహనదారులు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మహాదేవపూర్ మండల కేంద్రంలోని వారపు సంత తోపాటు బ్రాహ్మణపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి భారీ గుంతలుగా ఏర్పడి వర్షాకాలం కావడంతో వర్షపు నీరు గుంతలలో పేర్కొ పై ఉండడంవల్ల వాహనదారులతోపాటు పాదచారులు పాఠశాలలకు విద్యార్థిని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు రహదారిపై గుంతలలో నీరు నిల్వ ఉండి ప్రయాణం సాగించడం ఇబ్బందికరంగా ఉంటే మరోవైపు రహదారిపై వాహనాలు పార్కింగ్ చేసి ఉండడంతో రహదారి పైనుండి వర్షాకాలం ప్రయాణించడం వర్ణతీతమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రహదారిపై ఓవైపు వాహనాలు పార్కింగ్ చేసి ఉంటే మరోవైపు గుంతలలో నీరు ఉండడంతో వేగంగా వచ్చిన వాహనాల వల్ల గుంతలలోని నీరు పాఠశాలలకు వెళ్లే విద్యార్థినిలపై మహిళలపై చిల్లడంతో అవమానానికి గురవుతున్నట్లు ఆవేదనతో వాపోతున్నారు వారపు సంత తో పాటు మండల కేంద్రంలోని పలు వాడలకు సంబంధించిన ప్రజలు అదే కాక బ్రాహ్మణపల్లి గ్రామంలో ఉన్న ఆరోగ్య కేంద్రంకి గర్భిణీలు బాలింతలు టీకాల కోసం వెళ్లాలన్న ఇదే ప్రధాన రహదారి పైనుండి నరకపు అంచుల్లో ప్రయాణం చేస్తున్నామని ఆవేదనతో మొరపెట్టుకుంటున్నారు రాత్రి వేళలో ఆ ప్రదేశంలో విద్యుత్ బల్బులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు అంటున్నారు.ఇటీవల కేంద్ర ప్రభుత్వ నిధులతో ఎక్కువ జన సంచారం లేని చోట రహదారి నిర్మాణ పనులు చేపట్టడానికి అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు అధికారులు ప్రభుత్వం చొరవ తీసుకొని గుంతలుగా ఏర్పడ్డ రహదారిలపై మరమ్మతు చర్యలు చేపట్టి రహదారులపై వాహనాల పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.?

# 1000 రోజుల పాలనలో హామీలకు దిక్కేది?

- 420 అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్...
- రైతులను విస్మరించిన రేవంత్ ప్రభుత్వం..
- మేనిఫెస్టోలో ఇచ్చిన మాటలన్నీ ఏమయ్యాయి?..
- మంథని ప్రజలను మోసం చేసేలా పాలన
- మంత్రి శ్రీధర్‌బాబుపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ధ్వజం

**ముత్తారం, సెప్టెంబరు 3 (ప్రతినిధి):**

ఎన్నికల ముందు వందలాది హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. పాలనలో 1000 రోజులు పూర్తి చేసుకుంటున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆరోపించారు. 420 అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్.. రైతులు, పేదలు, సామాన్య ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తోందని ఆయన మండిపడ్డారు.ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.ముత్తారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.అధికారంలోకి రావడానికి ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు.. ఇప్పుడు వాటి అమలు విషయాన్ని పక్కన పెట్టి రాజకీయ ప్రచారానికే పరిమితమవుతున్నారని విమర్శించారు.హామీలతో ఓట్లు.. అధికారంలోకి వచ్చాక మరిచారా?

**అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో హామీ అమలుపై ప్రభుత్వం మాట మార్చే పరిస్థితి**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేశారని పుట్ట మధుకర్ అన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో హామీ అమలుపై ప్రభుత్వం మాట మార్చే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు కేవలం ఎన్నికల ప్రచారానికే పరిమితం కాకూడదని, వాటిని అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.1000 రోజుల పాలన పూర్తవుతున్నా.. హామీల అమలుపై పూర్తి స్థాయి స్పష్టత లేకపోవడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోందని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఏమి చెప్పారు? ఇప్పటి వరకు ఏమి చేశారు? ఇంకా ఏమి చేయాల్సి ఉంది? అనే అంశాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసి ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.రైతుల పరిస్థితి ఏమిటి?

రాష్ట్రంలో రైతుల సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యతతో పరిష్కరించాల్సిన అవసరం ఉందని పుట్ట మధుకర్ అన్నారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రైతులు పంటలు సాగు చేసేందుకు పెట్టుబడులు పెట్టి, ప్రకృతి వైపరీత్యాలు, మార్కెట్ పరిస్థితులు, సాగు వ్యయాల పెరుగుదల వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు.ఇలాంటి సమయంలో ప్రభుత్వం రైతులకు అండగా నిలవాల్సింది పోయి హామీల అమలులో జాప్యం చేయడం సరికాదన్నారు.రైతులకు ఇచ్చిన హామీలను కాలపరిమితిలోగా అమలు చేయాలని, రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించే చర్యలు చేపట్టాలని కోరారు. రైతులకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

**మంథని ప్రజలకు ఇచ్చిన హామీల సంగతేంటి?**

మంథని నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై కూడా పుట్ట మధుకర్ ప్రశ్నలు సంధించారు. మేనిఫెస్టో రూపకల్పనలో కీలక బాధ్యతలు నిర్వహించిన మంత్రి శ్రీధర్‌బాబు.. మంథని ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.మంథని ప్రజలు నమ్మకంతో కాంగ్రెస్‌కు అవకాశం కల్పించారని,ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సమస్యలు, రైతుల ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.ఎన్నికల సమయంలో ప్రజల ముందుకు వెళ్లి ఇచ్చిన మాటలను ఇప్పుడు గుర్తు చేసుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. హామీలు ఇచ్చినప్పుడు ప్రజల ఓట్లు అవసరం.. ఇప్పుడు హామీల అమలు అడిగితే మాత్రం సమాధానం చెప్పకుండా తప్పించుకోవడం ప్రజలను మోసం చేయడమేనని పుట్ట మధుకర్ విమర్శించారు.

**మేనిఫెస్టో చైర్మన్‌గా సమాధానం చెప్పాలి**

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీల అమలు విషయంలో మంత్రి శ్రీధర్‌బాబు బాధ్యత తీసుకోవాలని పుట్ట మధుకర్ అన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించి ఓట్లు అడిగిన నాయకులు.. ఇప్పుడు వాటి అమలుపై కూడా అదే స్థాయిలో ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు.మంథని ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించి,ఏ హామీ ఎప్పుడు అమలు చేస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. మాటలతో కాకుండా కార్యాచరణతో ప్రజలకు ప్రభుత్వం భరోసా కల్పించాలన్నారు.

**ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలు వద్దు**




ఎన్నికలు వచ్చినప్పుడు కొత్త హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత పాత హామీలను మరిచిపోవడం ప్రజాస్వామ్యంలో సరైన విధానం కాదని పుట్ట మధుకర్ అన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, ప్రభుత్వ పనితీరును గ్రామస్థాయిలో చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు.రైతులు, పేదలు, కార్మికులు,యువత,మహిళలు సహా అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని కోరారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం మరింత దెబ్బతింటుందని హెచ్చరించారు.

**వాగ్దానాలపై లెక్క చెప్పాల్సిందే**

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలపై బహిరంగ చర్చకు సిద్ధం కావాలని పుట్ట మధుకర్ సవాల్ చేశారు.ఏ హామీ అమలు చేశారు,ఏవి పెండింగ్‌లో ఉన్నాయి, ఏవి అమలు చేయలేకపోతున్నారు..

కారణాలేమిటో ప్రజలకు వివరించాలని అన్నారు.ప్రజల సమస్యల పరిష్కారమే పాలనకు కొలమానం కావాలని, ప్రచార కార్యక్రమాలు కాదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలు మరచిపోలేదని,ప్రతి హామీ అమలును ప్రజలు ప్రశ్నిస్తూనే ఉంటారని అన్నారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు పప్పు స్వరూప,రైతు సమితి అధ్యక్షుడు అత్తే చంద్రమౌళి,మాజీ ప్యాక్స్ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్య,ముత్తారం సర్పంచ్ మాజీ వైస్ ఎంపీపీ సుదాటి రవీందర్ రావు,మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు నూనె కుమార్,నాయకులు నాంసాని సమ్మయ్య చల్ల సమ్మయ్య, తాడూరి రమేష్, ఎజ్జ తిరుపతి, యార విజేందర్, వెంకట్ రెడ్డి,బొమ్మిడి మల్లేష్, బియ్యని రాజు,పప్పు చంద్రమౌళి,కండే రమేష్,నిలం అంజి,గాధం శ్రీనివాస్,తిత్తుల శ్రీనివాస్,కూరాకుల ఓదెలు,ఇల్లందుల అశోక్,మెంగని మల్లేష్,నూనె రాజేందర్,నాయకులు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు

# మున్సిపల్ ఏజెండాలని అంశాలపై విచారణ చేపట్టాలి

**కమిషనర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ శాఖ అధికారికి ఫిర్యాదు చేసిన జయశ్రీ**

**జగిత్యాల సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి)**



జగిత్యాల మున్సిపాలిటీలో గత కౌన్సిల్ నుండి డీజిల్ రిపేర్ల పేర్లమీద కుంభకోణాలు జరగడం అవినీతికి పాల్పడడం వంటి సందర్భంలో ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్ విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా పలుమార్లు విజిలెన్స్ దాడులు చేసి ఎంక్వైరీ ఇంకా కొనసాగుతున్నప్పటికీ డీజిల్ రిపేర్లు పేర్ల మీద అవినీతి జరుగుతూనే ఉంది వాహనాలు రిపేర్లు చూపుతూ అందులో కూడా డీజిల్ పోసినట్లు చూపుతూ ఒక్క ట్రిప్పు తీసిన వాహనాలకు రెండు ట్రిప్పులుగా చూపుతూ ఈ విధంగా ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్న అధికారులపై పూర్తిస్థాయి విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని మాజీ కౌన్సిలర్ హనుమాండ్ల జయశ్రీ కోరారు అవుట్సోర్సింగ్ అధికారులకు ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ ఎం ఐ ఎస్ ఆపరేటర్లకు ఔట్సోర్సింగ్ వ్యక్తికి శానిటేషన్ ఇనిస్పెక్టర్ బాధ్యతలు అప్పగించడం తో బాధ్యతా రాహిత్యంలో వాళ్లు విధులు నిర్వహిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం కు పాల్పడుతున్న దృశ్య ప్రస్తుతం ఉన్న పర్మినెంట్ సానిటరీ ఇన్స్పెక్టర్లకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు హనుమాండ్ల జయశ్రీ తెలిపారు అలాగే వినాయక నిమజ్జనం ఏర్పాట్ల కొరకు 33.81 లక్షలు ఇందులో తాత్కాలిక లైటింగ్ జనరేటర్ రెండు రోజుల కొరకు 5 లక్షల రూపాయలు అలాగే తాత్కాలిక లైటింగ్ జనరేటర్ స్టేజి కండువాలు కొబ్బరికాయలు రెండు రోజులు ఐదు లక్షలు ఇందులో జనరేటర్ మెయిన్ జంక్షన్ ల వద్ద వాడుకున్న దీనిలో యాడ్ చేయడం జరిగింది స్టేజి ఒక టవర్ వద్ద మాత్రమే డ్రంబులు ఏర్పాటు చేసే మున్సిపల్ ట్యాప్ వాటర్ సప్లై చేస్తారు ఇందులకయ్యే ఖర్చు 5 లక్షల రూపాయలు ఈ విధంగా అవుతోందని ప్రశ్నించారు గజ నాటుతెప్పల రెండు రోజుల కొరకు కానీ ఇది అంశం 9వ నెంబర్ లో మూడో పేజీలో మొదటి రోజు గజ ఈతగాలకు నాటు తిప్పల కొరకు ఒక్కరోజు ఖర్చు 96 వెల రూపాయలు అయితే రెండు రోజులకు ఐదు లక్షల రూపాయలు ఏ విధంగా అవుతుంది జగిత్యాల మున్సిపాలిటీలో 100 కోట్లతో రోడ్డు నిర్మాణం చేసిన తర్వాత గుంతలు పూడ్చడానికి ప్రధాన రహదారిలో మాత్రం అయ్యే ఖర్చు 5 లక్షల రూపాయలు ఏ విధంగా పైన తెలిపిన అంశాల పైన పూర్తిస్థాయి విచారణ జరిపి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని ఈ రకంగా అంచనాలు తయారు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆరు బతుకమ్మ ఘట్ల వద్ద మొరం డస్ట్ పోయడానికి అయ్యే ఖర్చు 5 లక్షల రూపాయలు కానీ బతుకమ్మ ఘాట్లు ను చింతకుంట చెరువు మోతే చెరువు కండ్ల పెల్లి చెరువు వద్ద లక్షల రూపాయలతో సీసీ తో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం జరిగింది

మరి ఈ మొరం డస్ట్ ఎక్కడ పోస్తారు తెలియని పరిస్థితి ఏడవ ఎనిమిదవ ఒకటి నుండి 25 నుండి 50 వార్డులలో బతుకమ్మ పండుగ సందర్భంగా వరం డస్ట్ పోయడానికి 3 3 మొత్తం 6 లక్షల రూపాయలు ఈ సందర్భంగా అధికారులకు తెలియాల్సిన విషయం ఏమిటంటే జగిత్యాల పట్టణంలోని వార్డులలో గత కౌన్సిల్ ఇప్పుడున్న కౌన్సిల్ కోట్ల రూపాయలతో ప్రతి వార్డుల్లో రోడ్లు డ్రైనేజీ నిర్మాణం చేశామని అధికారులు ప్రజాప్రతినిధులు చెపుతున్నారు మరి ఈ మొరం డస్ట్ ఎక్కడ పోస్తారు అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న అధికారుల వద్ద అంచనా తయారు చేసి రోడ్ల వివరాలు లేకుండానే ఈ అంచనాలు తయారు చేశారు కావున భేటీ మీద పూర్తిస్థాయి విచారణ జరిపి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని గణేష్ నిమజ్జనం ఏర్పాట్లకు దసరా బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి కొన్ని పనులను వారి సంబంధించిన వ్యక్తులకు కాంట్రాక్టు ఇచ్చే ఉద్దేశంతో బాక్స్ టెండర్లు పెట్టి అవినీతికి పాల్పడుతున్న దృష్ట్యా ప్రతి ఒక్క పనికి ఆన్లైన్ టెండర్ జరిపే విధంగా చర్యలు తీసుకోవాలని అంశం నెంబర్ 7 ఇందులో 9 వ అంశం 9 కంప్యూటర్ ప్రింటర్ కొనుగోళ్ల కొరకు 99 లక్షలు గతం లో మున్సిపల్ లో చాలా కంప్యూటర్లు ప్రింటర్లు కొనుగోలు చేయడం జరిగింది మొత్తం ఎన్ని కొనుగోలు చేశారని సమాచార హక్కు ప్రకారం అడిగిన సమాచారం ఇవ్వని అధికారులు కావున పూర్తి సమాచారం ఇస్తూ ప్రసాదం దుర్వినియోగం కాకుండా చూడాలని అంశం నెంబర్ 9 వాహనాల కొనుగోలు 3 ఇవి ఆటో టిప్పర్ కొనుగోలు కొరకు 62 లక్షలు కానీ టాటా బ్రాండ్ కు సంబంధించినవి నేను తీసుకుంటే పది లక్షల రూపాయల లోపే ఉన్నాయి జిఎస్టి ఐదు శాతం అన్నారు కానీ జగిత్యాల మున్సిపాలిటీ వారి కొటేషన్ ప్రకారం ఒక్కో ఆటో 17 లక్షల రూపాయలు జిఎస్టి 23శాతం అంటే 3లక్షల 70 వేలు గత 6 మాసాల నుండి ఒక బ్లడ్ ట్రాక్టర్ మిస్సయింది ఇప్పటికైనా పూర్తిస్థాయి విచారణ జరిపించి అధికారుల మీద చర్యలు తీసుకోవాలని బ్లేడు ట్రాక్టర్ కొనుగోలు లో కూడా అవినీతి జరుగుతున్నట్లు విచారణలో తేలింది కావున ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని ఈ వాహనాల కొనుగోలు చేసి రిపేర్లు వచ్చినప్పుడు సరైన సమయంలో రిపేరు చూపించక షో రూమ్లలో వదిలివేసిన సందర్భంలో ఎన్నో షోరూమ్ వాళ్ళు వాహనాల పార్ట్లను తీసి వాళ్ళు వేరే వాహనాలను వేయడం నెలలు కొన్ని సందర్భాలలో సంవత్సరాల కొల్లది షో రూమ్లలో ఉండిపోవడంతో అవిష్కాప్ కింద తీసివేయాల్సిన పరిస్థితి ప్రస్తుతం 15వ ఫైనాన్స్ గ్రాండ్ నుండి కోటి 47 కోటి రూపాయల లోపు కొనుగోలు చేయవచ్చు కావున వేటిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని అంశం నెంబర్ 10 లో గత కౌన్సిల్ 2020 వరకు ఉన్నా 2021 2022 సంవత్సరమునకు గాను చేసిన బిల్లులు అప్పుడున్న కౌన్సిల్ తీర్మానం చేసిన దీనికి పూర్తి ఆధారాలు లేకపోవడంతో అప్పుడు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన విచారణ జరుపకపోవడంతో అప్పుడున్న కమీషనర్ గా ఉన్నట్టు చూపుతున్నారు ఈ రకంగా మిగతా వాహనాల్లో కూడా నిధులు దుర్వినియోగం జరగబోతుంది కావున ప్రజాధనం కాకుండా చూడాలని ముఖ్యంగా ఇక్కడి మున్సిపాలిటీలో 50 లక్షల పెట్టి స్వీప్పింగ్ మిషన్ కొనుగోలు చేసి వారం పది రోజులు రోడ్డుపై తిప్పి షెడ్యూకే పరిమితం చేశారు ఈ మిషన్ రిపేర్ ల పేరు మీద కొన్ని లక్షల రూపాయలు ఖర్చు చేశారు ఒక టిప్పర్ దాదాపు 50 లక్షల ఖర్చు పెట్టి కొనుగోలు చేశారు దానిని కూడా కేవలం మెయిన్ రోడ్డులలో చెత్త కలెక్షన్ కు వాడుతున్నారు ఇప్పుడు కొనుగోలు చేయబోతున్న 14 టైర్ల టిప్పర్ 60 లక్షల రూపాయలతో కొనుగోలుకు తీర్మానం తీసుకున్నారు సెంటర్ మీడియం పాయింట్ నుండి ఆటోలో ఉన్న చెత్త కలెక్షన్ కొరకు అంటున్నారు కానీ అసలు సెంటర్ మీడియన్ పాయింట్ లేదా ఇప్పటివరకు స్థలాన్ని గుర్తించ లేదు జగిత్యాల మున్సిపాలిటీ అధికారుల పనులు పిల్ల పుట్టకముందే పుల్ల కట్టినట్టు ఉంది బ్లేడు ట్రాక్టర్ కొనుగోలు కొరకు 22 లక్షలు జగిత్యాల మున్సిపాలిటీ వారు ఇప్పటికీ రెండు ట్రాక్టర్లు 5 ఆటోలు మిస్సింగ్ అయినా సందర్భంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే విజిలెన్స్ ఎంక్వయిరీ కూడా జరిగిన ఇప్పటివరకు ఏ రకంగా మిస్ అయినవి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోకపోవడంతో ఈ మధ్య బిల్లు చెల్లించకపోవడంతో పెండింగ్లో ఉన్న బిల్లును కొత్తగా వచ్చిన కౌన్సిల్లో ఎజెండాలో పొందుపరిచి బిల్లు చెల్లింపుకు తీర్మానం చేస్తున్నారు ఇప్పుడు ఈ కౌన్సిల్ కు ఏమీ అధికారం ఉంది పాత బిల్లులు చెల్లింపు కొరకు కొత్తగా వచ్చిన కమీషనర్ కు ఏమీ ఆధారాలు ఉన్నాయి ఏ రకంగా చెల్లింపు చేస్తారు ఈ ఒక్క అంశాన్ని ఆధారంగా చేసుకొని అదనపు ఎజెండా టేబుల్ ఎజెండా కింద గత కౌన్సిల్లో 2021 సంవత్సరాలకు సంబంధించిన బిల్లు మెస్ బిల్లు చెల్లింపులకు అప్పుడు కోవిడ్ సమయంలో వాడిన అంబులెన్స్ అతనికి స్థలం లేక మున్సిపల్ లో పార్కింగ్ పెట్టుకుని దానికి కూడా బిల్లు చెల్లించాలంటే అప్పుడున్న కౌన్సిల్ సభ్యులు వ్యతిరేకించి బిల్లు చెల్లించకపోతే 12 4 2021 నుండి 29 1 2022 కు సంబంధించిన బిల్లులు ఇప్పుడు చెల్లించడానికి తీర్మానం చేయడం విడ్డూరంగా ఉంది

# ఆటపాటలతో అలరించిన విద్యార్థులు




**ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు**

**మంథని, సెప్టెంబర్ 3: వుదయం ప్రతినిధి**

మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ బాలోజీ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించి ఉన్నత ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఇటీవల అల్పాహారం అందిస్తోందని, త్వరలో మధ్యాహ్న భోజన సౌకర్యం కూడా అందుబాటులోకి రానుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల నృత్యాలు, ఇతర కళా ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జాన్సీ, తిరుపతి, రావుల తిరుమల్, శశాంక్, శ్రీదేవి, నగేష్, ఎల్‌ఆర్‌కే రెడ్డి, మౌనిక, సబిత, అతిథి అధ్యాపకులు సురేష్, దీపారాణి, సిబ్బంది బియ్యబాని, రాజయ్య, అర్జయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**ఎమ్మెల్సీ మల్క కొమరయ్య**

**పెద్దపల్లి, సెప్టెంబరు 03 (వుదయం ప్రతినిధి)**

రాష్ట్రంలోని 8 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై వినతిపత్రం సమర్పించేందుకు సచివాలయానికి శాంతియుతంగా పాదయాత్రగా వెళ్తున్న బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఆయన ఖండించారు. విద్యార్థుల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించడం నేరమా? అంటూ ఆయన ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో సుమారు రూ.15 వేల కోట్ల మేర బకాయిలు ఉన్నాయని ఆరోపించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ కేవలం ఆర్థిక అంశం కాదని, విద్యార్థుల విద్య, ఉన్నత చదువులు, ఉపాధి అవకాశాలు, భవిష్యత్తుతో ముడిపడిన కీలకమైన అంశమని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిల చెల్లింపుపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, ఎంపీ డీకే అరుణ, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# బీసీ హాస్టల్ నుండి మోడల్ స్కూలుకు వెళ్తూ నలుగురు బాలురు అదృశ్యం

**ఎస్ఐ వెంకన్న**

**నర్సింహులపేట సెప్టెంబర్ 03 వుదయం ప్రతినిధి**



బీసీ సంక్షేమ వసతి గృహంలో ఉంటూ మోడల్ స్కూల్ చదువుతున్న క్రింది నలుగురు బాలురు అదృశ్యమైనట్లు సమాచారం నిన్న ఉదయం ఈ నలుగురు బాలురు వసతి గృహం నుండి పాఠశాలకు వెళ్లినప్పటికీ, పాఠశాలలోకి ప్రవేశించలేదు. ఉదయం సుమారు 11:30 గంటలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వారి గైర్హాజరు గురించి విచారించినప్పటికీ, విషయాన్ని సీరియస్‌గా తీసుకోకుండా వారి తల్లిదండ్రులకు మాత్రమే సమాచారం అందించారు. గురువారం వారి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి సమాచారం అందించారు. వసతి గృహంలో విచారణ చేయగా, సిగరెట్ బాక్స్ కలిగి ఉన్నందుకు వసతి గృహ వార్డెన్ బాలురను మందలించినట్లు తెలిసింది.అదేవిధంగా, వారి వసతి గృహ సహచరులను విచారించగా, వారు తీర్థయాత్రకు వెళ్లినట్లు, ముఖ్యంగా తిరుపతి, యాదగిరిగుట్ట వెళ్లినట్లు తెలిపినట్లు సమాచారం.

# చలో హైదరాబాద్

**మహా ధర్నాను జయప్రదం చేయాలి**

**ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెపు శివరామకృష్ణ**

**కోరుట్ల సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి)**




ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం ప్రభుత్వ హామీల సాధన కోసం తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈ జేఏసీ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10 2026 గురువారం న హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో తలపెట్టిన చలో హైదరాబాద్ ఉద్యోగుల హక్కుల సాధన సభను రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతం చేయాలని ఎస్టీయూ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెపు శివరామకృష్ణపిలుపునిచ్చారు గురువారం కోరుట్ల మండలంలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మెరుగైన ఫిట్‌మెంట్.తో 2వ పీఆర్సీ నివేదికను వెంటనే అమలు చేయాలని ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మొత్తం 6 కరవు భత్యాలను (డిఏ) తక్షణమే విడుదల చేయాలని ఉద్యోగులు పెన్షనర్ల పెండింగ్ బిల్లులను నెలకు కనీసం 2 వెల కోట్ల రూపాయలు చొప్పున చెల్లించాలని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్) పునరుద్ధరించాలని ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఎన్ఈహెచ్ఎస్)ను ఎలాంటి లోపాలు లేకుండా పూర్తిగా సమర్థవంతంగా అమలు చేయాలని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు పెండింగ్‌లో ఉన్న మిగిలిన అన్ని డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఈ మహాధర్నాకు ఉద్యోగ ఉపాధ్యాయులు అందరూ పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ఎస్టీయు కోరుట్ల మండల శాఖ అధ్యక్షులు సిరిపురం రాజేష్ జిల్లా ఉపాధ్యక్షులు రఫూఫ్ జిల్లా కార్యదర్శి పరందాం తదితరులు పాల్గొన్నారు.

# శిశు మరణాల నివారణకు సమన్వయంతో పనిచేయాలి

**జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి సుజాత**

**జగిత్యాల సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి)**




జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి సుజాత అధ్యక్షతన 3 9 2026న శిశు మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు జిల్లాలో నమోదైన శిశు మరణాల కారణాలను విశ్లేషించి నివారణ చర్యలను మరింత పటిష్టంగా అమలు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు ఇట్టి సమావేశంలో జిల్లాలో నమోదైన శిశు మరణాలకు దారితీసిన కారణాలు హైరిస్క్ గర్భిణీల పర్యవేక్షణ ప్రసవాల నిర్వహణ నవజాత శిశువుల సంరక్షణ అత్యవసర రిఫరల్ సేవలపై సమగ్రంగా సమీక్షించారు హైరిస్క్ గర్భిణీలను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని గర్భిణీలకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన ఆరోగ్య సేవలు అందించాలని డాక్టర్ జి సుజాత సూచించారుఈ సమీక్ష సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ ఎన్ శ్రీనివాస్, డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి డీఐఓ డాక్టర్ నరేంద్ర ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ అర్చన (ఎన్ వి బి డి సి పి) డాక్టర్ ఎన్ రాజేందర్ (ఎన్ సి డి) పీడియాట్రిషన్ డాక్టర్ గుండేటి అర్జున్ డాక్టర్ రమా పీడియాట్రిషన్ గైనకాలజిస్ట్ డాక్టర్ బి ఉష ఏ భాస్కర్ డీడబ్ల్యూ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ సతీష్ కుమార్ డాక్టర్ శివకుమారి డాక్టర్ వాహిని డాక్టర్ సౌజన్య హెచ్ఈఓ ఏ రాజేశం హెచ్ఈ రాథోడ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో రైతులకు తీరని అన్యాయం

- 420 హామీలు, వరంగల్ రైతు డిక్లరేషన్‌ను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- రైతు సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ ఇంచార్జి దాసరి మనోహర్ రెడ్డి

**పెద్దపల్లి, సెప్టెంబరు 03 (వుదయం ప్రతినిధి)**



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినప్పటికీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని బీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన పై బిఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న ఆందోళనలో భాగంగా నియోజకవర్గంలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, కాల్వ శ్రీరాంపూర్, ఓదెల జూలపల్లి, ఎలిగేడు మండల కేంద్రాల్లో గురువారం నిర్వహించిన రైతు సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన వరంగల్ రైతు డిక్లరేషన్, 420 హామీలను రైతులు గుర్తు చేసుకోవాలని కోరారు. రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని, కానీ పూర్తి స్థాయిలో అమలు చేయకుండా రైతులను మోసం చేసిందని పేర్కొన్నారు. భూమి ఉన్న రైతులతోపాటు కౌలు రైతులకు ఎకరాకు ఏడాదికి రూ.15 వేలు, భూమిలేని రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తామని చెప్పి మాట తప్పారని అన్నారు. అన్ని పంటలను మెరుగైన మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి నేడు రైతులకు మద్దతుధర అందించడంలో, కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో ధాన్యం కొనుగోలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. మూడు పంటలకు రైతుబంధు అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు రైతు భరోసా విషయంలోకూడా అయోమయానికి గురిచేస్తోందని మనోహర్ రెడ్డి అన్నారు. పంట నష్టపోతే తక్షణమే పరిహారం అందేలా పటిష్టమైన పంటల బీమా పథకం తీసుకొస్తామని చెప్పినా, వడగండ్ల వాన, తుపాన్లతో నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సాయం సకాలంలో అందడం లేదన్నారు. 24గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీఇచ్చి కనీసం 10 గంటల విద్యుత్‌కూడా అందించలేని పరిస్థితి తీసుకొచ్చారని విమర్శించారు.

**కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ..**

కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన సాగునీటి వ్యవస్థను కాపాడాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తోందని మనోహర్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టునుకూడా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని, బనకచర్ల అంశంలో తెలంగాణ రైతుల ప్రయోజనాలను బలిపెట్టే నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోకూడదని డిమాండ్ చేశారు. మూసివేసిన చక్కెర కర్మాగారాలను తెరిపించడం, పసుపు బోర్డు ఏర్పాటు, నకిలీ విత్తనాలు–పురుగు మందులపై కఠిన చర్యలు, రైతు కమిషన్ ఏర్పాటు, కొత్త వ్యవసాయ విధానం, రైతు కూలీలకు రైతు బీమా వంటి హామీలనుకూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని దాసరి మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. "ఎన్నికల సమయంలో రైతులపై హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అదే రైతులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతుల సమస్యలపై బిఆర్ఎస్ నిరంతరం రైతులకు న్యాయం జరిగేవరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశాల్లో జిల్లా గ్రంథాల సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, మాజీ ఎంపీపీలు నూనేటి సంపత్, స్రవంతి మోహన్ రావు, మాజీ జెడ్పిటిసిలు రాములు, వంగల తిరుపతిరెడ్డి,కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్ ,పార్టీ మండలాల అధ్యక్షులు మార్కు లక్ష్మణ్, రామ్ రెడ్డి, ఐరెడ్డి వెంకటరెడ్డి, దేవయ్య, బోయిని రాయమల్లు, మల్లేశం, రాజకుమార్, గుణపతి, సర్పంచ్ లు దీకొండ భూమేష్, ఒజ్జ సంపత్, బోయిని శ్రీనివాస్ లావణ్య, తోగురు శ్రీనివాస్, గుడుగుల సతీష్, చొప్పరి అంజన్న, ఖమ్మంపల్లి బాపయ్య, అరిగొప్పుల రాణి మోహన్, తీగల నాగరాజు, మచ్చ అరుణ యాదగిరి, సదాశివరెడ్డి, పాతకుల అనూష అనిల్, బి ఆర్ ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆకాశం వైపు.. రైతన్న చూపు , అడుగంటుతున్న భూగర్భ జలాలు, ఎండుతున్న పంటలు

**కరువుకాటకంతో నిరాశలో రైతన్నలు**

**పెద్దపల్లి (సుల్తానాబాద్) సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి)**



ఆకాశం వైపు ఆశగా చూస్తున్న రైతన్నకు నిరాశే మిగులుతోంది. వాన జాడ లేకపోవడంతో సుల్తానాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో కరువు ఛాయలు అలుముకుంటున్నాయి. రాములపల్లి, సుద్దాల, అల్లిపూర్ తదితర గ్రామాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో బోరుబావుల్లో నీటిమట్టం రోజురోజుకు అడుగంటుతోంది. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా మారాయి. వానాకాలం ప్రారంభంలో ఆశాజనకంగా కనిపించిన పంటలు ప్రస్తుతం వర్షాలు లేక నీటి కోసం ఎదురు చూస్తున్నాయి. పొలాల్లో పచ్చదనం క్రమంగా కనుమరుగవుతూ పంటలు ఎండిపోతున్నాయి. బోరుబావుల్లో నీరు లేకపోవడంతో సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు పంటలు చేతికందకపోతే పరిస్థితి ఏమిటన్న ఆందోళనలో ఉన్నారు.

గతంలో భూగర్భ జలాల ఆధారంగా పంటలు సాగు చేసుకునే రైతులు ప్రస్తుతం బోరుబావుల్లో నీరు తగ్గిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని బోర్లలో నీరు అడుగంటిపోవడంతో మోటార్లు పనిచేయని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. మరికొన్ని చోట్ల అరకొరగా వస్తున్న నీటితో పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఒకవైపు ఎరువులు, విత్తనాలు, కూలీల ఖర్చులు పెరుగుతుండగా.. మరోవైపు ప్రకృతి సహకరించకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతులకు వర్షాభావం మరింత భారంగా మారింది. వర్షం కురిస్తేనే పంటలకు ఊపిరి వస్తుందని, లేదంటే తీవ్ర నష్టం తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సుల్తానాబాద్ మండలం లోని రాములపల్లి, సుద్దాల, అల్లిపూర్‌తో పాటు వర్షాభావ పరిస్థితులు నెలకొన్న గ్రామాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల పరిస్థితిని పరిశీలించాలని రైతులు కోరుతున్నారు. భూగర్భ జలాల పరిస్థితి, పంటల ఎండుదలపై సమగ్రంగా అంచనా వేసి, అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**"వాన కోసం ఎదురుచూస్తున్నాం..**

పంటలను కాపాడుకోవడానికి చేతనైనంత ప్రయత్నం చేస్తున్నాం. వర్షం మరికొంత ఆలస్యమైతే పెట్టిన పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి ఉండదు" అని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి కరుణ కోసం ఎదురుచూస్తున్న సుల్తానాబాద్ మండల రైతన్నలకు ప్రభుత్వం, అధికారులు అండగా నిలిచి తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.